అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
మనసర్కార్ PRGI REG. No.: TGTEL/25/A0540 Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com



సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:158 | హైదరాబాద్ 08 జనవరి 2026, గురువారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-158 | Hyderabad 08 January 2026, Thursday | Pages: 8, Rs. 5/-



అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
మనసర్కార్
email: jobs@manasarkar.com


# పది జిల్లాలు రద్దు?

కొత్త జిల్లాలపై కసరత్తు

'ఫ్యూచర్ సిటీ' జిల్లాకు జైపాల్ రెడ్డి పేరు?

చిన్న జిల్లాలుగా ఉన్న సిరిసిల్ల, సిద్దిపేట, నారాయణపేట, ములుగుతో పాటు మరో ఆరు జిల్లాలను రద్దు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ , అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిని బట్టి జిల్లాల సరిహద్దులను మళ్లీ ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. గతంలోనూ రేవంత్ రెడ్డి ప్రతి లోక్‌సభ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేయాలని అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. ఆ దిశగానే ఇప్పుడు అడుగులు పడుతున్నట్లు కనిపిస్తోంది.

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కసరత్తు చేస్తోంది. పరిపాలనా సౌలభ్యం, నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దుల ప్రాతిపదికన గత బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటైన 33 జిల్లాలను, 23కి కుదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సుమారు 10 జిల్లాలను రద్దు చేసి, వాటిని పక్కనే ఉన్న పెద్ద జిల్లాల్లో విలీనం చేసే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.**

కొన్ని జిల్లాలకు పేర్లు మార్చాలనే ప్రతిపాదనలను కూడా తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తోంది. ముఖ్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'ని ఒక ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి, దానికి దివంగత కేంద్ర మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు సమాచారం. నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్న కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఈ ఫ్యూచర్ సిటీ జిల్లాలో కలిపి, దీనిని 'జైపాల్ రెడ్డి జిల్లా'గా మార్చే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన కొత్తలోనే జిల్లాల పునర్వ్యవస్థీకరణపై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 33 జిల్లాలు ఉండటం వల్ల పాలనాపరమైన ఖర్చులు పెరగడమే తప్ప ఆశించిన ఫలితాలు రావడం లేదని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే చిన్న జిల్లాలను విలీనం చేయడం ద్వారా వ్యవస్థలను బలోపేతం చేయాలని చూస్తోంది. అయితే, ఈ ప్రతిపాదనలపై ప్రజల నుంచి మరియు ప్రతిపక్షాల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



## వెనుజువెలా మా మిత్ర దేశమే

మదురో అరెస్టుపై భారత్ ఆగ్రహం | శాంతియుత పరిష్కారం కావాలని జైశంకర్ పిలుపు

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

వెనుజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం అదుపులోకి తీసుకోవటంపై భారత్ తొలిసారిగా స్పందించింది. లక్సెంబర్గ్ పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుజువెలాతో భారత్‌కు దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలున్నాయని గుర్తు చేశారు . అక్కడ నెలకొన్న ఉద్రిక్తతలు చర్చల ద్వారానే పరిష్కారం కావాలని జైశంకర్ ఆకాంక్షించారు.

...::: తరువాయి 2వ పేజీలో..

## తిరుమల శ్రీవారి సేవలో మారిషస్ దేశాధ్యక్షుడు



**తిరుపతి (ఏడీఎన్ఎన్) :**

తిరుమల శ్రీవారిని మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న గోకుల్‌కి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. నైవేద్య విరామ సమయంలో శ్రీవారి దర్శనాన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేసి, సంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాదలతో గోకుల్‌ని గౌరవించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకులు మండపంలో టీటీడీ వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఫోటో, తీర్థప్రసాదాలను, మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌కు చైర్మన్ బీఆర్. నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా తిరుమల ఆలయ విశిష్టత, శ్రీవారి ఆచారాలు, నిత్యకైంకర్యాలు, దర్శన విధానాల గురించి వివరించారు. భారతీయ సంప్రదాయాలు, హిందూ ధార్మిక విలువల పట్ల తనకున్న గౌరవాన్ని ఈ సందర్భంగా గోకుల్ వెల్లడించినట్లు టీటీడీ వర్గాలు తెలిపాయి. తిరుమలలో లభించిన ఆధ్యాత్మిక అనుభూతి జీవితాంతం గుర్తుండిపోతుందని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం.



## ప్రత్యక్ష పోరుకు ముద్రగడ సిద్ధం

మాజీ సీఎం జగన్‌తో భేటీ

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మళ్లీ క్రియాశీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాడేపల్లిలోని నివాసంలో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డితో ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు ముద్రగడ గిరిబాబు మర్యాదపూర్వకంగా బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, సామాజిక అంశాలతో పాటు పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయంపై ఒక భారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరాన్ని ముద్రగడ ఈ సందర్భంగా జగన్‌కు వివరించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అత్యధిక శాతం వ్యవసాయంపై ఆధారపడిన కాపులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అన్యాయం జరుగుతోందని ముద్రగడ పద్మనాభం అభిప్రాయపడినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 'కాపు నేస్తం' పథకం ద్వారా మహిళలకు అండగా నిలిచారని, కానీ నేటి ప్రభుత్వం ఆ పథకానికి గండి కొట్టిందని ఆయన జగన్ కు వివరించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ప్రస్తుతం రాష్ట్రంలో రైతాంగం గిట్టుబాటు ధరలు లేక, ఎరువుల కొరత వంటి తీవ్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, కాపుల హక్కుల కోసం ఉభయ గోదావరి జిల్లాల్లోని కీలక నేతలైన దాడిశెట్టి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, తోట త్రిమూర్తులు, కురసాల కన్నబాబు వంటి వారితో కలిసి క్షేత్రస్థాయిలో ఒక మహా ఉద్యమాన్ని చేపట్టాలని ఆయన జగన్ కు సూచించినట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీ




- 20 మందికి స్థానచలనం...
- కొత్త జోన్లకు డీసీపీల కేటాయింపు
- ఫ్యూచర్ సిటీ, మూడు కమిషనరేట్ల పరిధిలో కీలక మార్పులు


**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ యంత్రాంగంలో ప్రభుత్వం భారీ మార్పులు చేపట్టింది. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 20 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లలో కొత్తగా ఏర్పాటైన జోన్లకు డీసీపీలను కేటాయించడంతో పాటు, ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్‌కు అధికారులను ప్రభుత్వం ఖరారు చేసింది.

...::: తరువాయి 2వ పేజీలో..

## నేనే జూరాల నీళ్లిచ్చా!

తెలంగాణ నేతలకు గుర్తు చేసిన చంద్రబాబు



**రాజమహేంద్రవరం (ఏడీఎన్ఎన్) :**

గతంలో ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తానే, మహబూబ్‌నగర్ కు జూరాల నుంచి నీళ్లిచ్చానని, దేవాదుల, కల్వకుర్తి వంటి ప్రాజెక్టులను ప్రారంభించానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టును బుధవారం సందర్శించిన తర్వాత, ఆయన రెండు రాష్ట్రాల నీటి రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజల ప్రయోజనాల కోసం రాజకీయాలు చేయాలే తప్ప విరోధాలు పెంచకూడదని తెలంగాణ నేతలకు చంద్రబాబు నాయుడు సూచించారు. నీళ్ల విషయంలో రాష్ట్రాలు పోటాపోటీగా మాట్లాడుకోవటం సరికాదని, గోదావరిలో పుష్కలంగా నీరు ఉన్నందున జల వివాదాలు సృష్టించడం తగదని హితవు చెప్పారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం గోదావరి జలాలను మంజీరాకు మళ్లించినప్పుడు కూడా తాము అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు . తెలుగు జాతి ఒక్కటేనని, రెండు రాష్ట్రాల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలని ఆయన చెప్పారు. నీటి లభ్యత, నదుల అనుసంధానంపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, సముద్రంలో కలిసే మిగులు జలాలను వాడుకోవడం వల్ల రాయలసీమతో పాటు తెలంగాణలోని కొన్ని ప్రాంతాలకు కూడా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టు పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు.

...::: తరువాయి 6వ పేజీలో..

## తమిళనాడు, పుదుచ్చేరిలకు ఉత్తమ్ కుమార్ రెడ్డి

పరిశీలకులను నియమించిన ఏఐసీసీ

ఐదు రాష్ట్రాల ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

దేశవ్యాప్తంగా త్వరలో జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ అధిష్టానం కసరత్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాలకు ఏఐసీసీ సీనియర్ అబ్జర్వర్లను నియమిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని పార్టీ ప్రకటించింది.తెలంగాణ రాష్ట్రం నుంచి సీనియర్ నేత, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కీలక బాధ్యతలను అప్పగించింది. ఆయనతో పాటు ముకుల్ వాస్నిక్, ఖాజీ మహమ్మద్ నిజాముద్దీన్ తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికల వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు. కేరళ రాష్ట్రానికి యువనేత సచిన్ పైలట్‌తో పాటు కేజే జార్జ్, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, కన్హయ్య కుమార్‌లను పరిశీలకులుగా నియమించారు. అస్సాం ఎన్నికల బాధ్యతలను ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, బంధు తిర్కీలకు అప్పగించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి సుదీప్ రాయ్ బర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిలను సీనియర్ పరిశీలకులుగా ఏఐసీసీ ఖరారు చేసింది.ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పార్టీ వ్యూహరచన, అభ్యర్థుల ఎంపికతోపాటు, సమన్వయకర్తలుగా కూడా ఈ సీనియర్ నాయకులు ముఖ్య పాత్ర పోషించనున్నారు.





## వైసీపీ ఎమ్మెల్యేలపై ఎథిక్స్ కమిటీ సీరియస్

సభకు రాకుండానే జీతాలు డ్రా చేయడంపై విచారణ | సభ్యత్వాల రద్దు లేదా రికవరీ దిశగా కఠిన చర్యలకు సిఫారసు?

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ నిబంధనలను ధిక్కరిస్తూ, సభా కార్యక్రమాలకు గైర్హాజరవుతున్న ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేల తీరుపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కమిటీ బుధవారం సమావేశమైంది . ప్రజాప్రతినిధులుగా ప్రజల గొంతుకను సభలో వినిపించాల్సిన బాధ్యతను విస్మరించి, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పదవులను వాడుకోవడంపై ఎథిక్స్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది.పార్టీ నిర్ణయం పేరుతో సభను బహిష్కరిస్తున్న ఈ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఖజానా నుంచి అందే జీతాలు, టీఏ , డీఏ లను మాత్రం క్రమంతప్పకుండా తీసుకుంటున్నట్లు కమిటీ ప్రాథమికంగా గుర్తించింది. సభకు రాకుండానే అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను పొందడం నైతికంగా నేరమని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. సభకు రావడం అనేది ఎమ్మెల్యేల హక్కు మాత్రమే కాదు, అది వారి ప్రాథమిక బాధ్యత అని, ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ సభను అవమానించడం తగదని స్పీకర్ కార్యాలయ వర్గాలు స్పష్టం చేశాయి. శాసనసభ నిబంధనల ప్రకారం, స్పీకర్ అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరుకాకపోతే సదరు సభ్యత్వంపై అనర్హత వేటు వేసే అధికారం సభకు ఉంటుంది. ప్రస్తుతం ఈ ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి వివరణ కోరాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది. వారిచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే క్రమ శిక్షణా చర్యలను సిఫారసు చేసే అవకాశం ఉంది. హాజరుకాని రోజులకు సంబంధించిన జీతభత్యాలను నిలిపివేయడం లేదా ఇప్పటికే తీసుకున్న మొత్తాన్ని రికవరీ చేయడం. నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి నిర్దిష్ట కాలం పాటు సభ నుండి సస్పెండ్ చేయడం. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ నిరంతరం గైర్హాజరవుతున్న వారిపై కఠినంగా వ్యవహరించి, సభ్యత్వాన్ని రద్దు చేయాలని సభకు నివేదించడం.విపక్ష హోదా లేదన్న సాకుతో సభకు రాకుండా తప్పించుకుంటున్న ఎమ్మెల్యేలకు ఎథిక్స్ కమిటీ తాజా నిర్ణయం ఒక గట్టి హెచ్చరికగా మారనుంది.



## ఏప్రిల్ 1 నుంచి జనగణన

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

దేశంలో జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా తొలి విడతలో , ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గృహాల లిస్టింగ్ కార్యక్రమం జరగనుంది. ప్రతి రాష్ట్రం ఈ ఆరు నెలల కాలపరిమితిలో తమకు వీలైన ఏదైనా 30 రోజుల వ్యవధిలో ఈ గణనను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభానికి 15 రోజుల ముందు నుంచే ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే 'స్వీయ గణన' ఆప్షన్‌ను కూడా అందుబాటులో ఉంచనున్నారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## వందేళ్ల... ఆర్ఎస్ఎస్

భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం

జాగృతి: తెలుగు గడ్డపై జాతీయవాద గొంతుక

75 ఏళ్లుగా తెలుగు వారి గుండెచప్పుడుగా నిలుస్తున్న 'జాగృతి' ప్రస్థానం



చరిత్రలో కొన్ని పత్రికలు కేవలం వార్తలను ప్రజలకు చేరవేయడానికి పుడతాయి. కానీ, చాలా అరుదుగా... కొన్ని పత్రికలు మాత్రమే "చరిత్రను మార్చడానికి" పుడతాయి. వ్యాపారం కోసం కాకుండా, ఒక ఆశయం కోసం... లాభాల కోసం కాకుండా, ప్రజల ప్రాణాల కోసం పుట్టిన ఆ అరుదైన పత్రికే "జాగృతి". దీని పుట్టుక ఒక సాధారణ రోజున జరగలేదు. అది 1948వ సంవత్సరం. హైదరాబాద్ సంస్థానం నెత్తురోడుతున్న కాలం. ఒకవైపు నిజాం నవాబు యొక్క ప్రైవేట్ సైన్యం "రజాకార్లు" గ్రామాలపై పడి దోచుకుంటున్నారు, ఆడబిడ్డల మానప్రాణాలతో ఆడుకుంటున్నారు. మరోవైపు, భారత జాతీయ జెండా ఎగరేయడం నిషేధం. "వందేమాతరం" అనే మాట వినిపిస్తే చాలు, నాలుక కోసేసే భయానక వాతావరణం. అప్పటికే ఉన్న కొన్ని ప్రధాన పత్రికలు నిజాం సెన్సార్‌షిప్ భయంతో నోరు మూసుకున్నాయి. కొన్ని పత్రికలు నిజాంకు భజన చేస్తున్నాయి. హిందువుల గోడు వినేవారే లేరు. ప్రజల కన్నీళ్లను తుడిచే నాధుడే లేడు. సమాజం మొత్తం బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న ఆ చిమ్మచీకటిలో... సరిగ్గా అప్పుడే, ఆ భయం గుప్పిట్లో నుంచి ఒక "ధైర్యం" పురుడు పోసుకుంది. ఆ ధైర్యమే... "జాగృతి". ఇది కేవలం సిరా మరియు కాగితంతో చేసిన పత్రిక కాదు. ఇది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) స్వయంసేవకుల "సంకల్పం"తో చేసిన అక్షరాయుధం. "నిజాం దగ్గర తుపాకులు ఉండవచ్చు... కానీ మా దగ్గర సత్యం ఉంది" అని నమ్మి, రజాకార్ల అరాచకాలను ప్రపంచానికి చాటిచెప్పడానికి, భారత యూనియన్ లో హైదరాబాద్ విలీనం (Integration) ఆవశ్యకతను ప్రజలకు వివరించడానికి...

...::: తరువాయి 2వ పేజీలో..




## టాటా గ్రూప్ ఇన్వెస్టర్లకు... ₹ 5 లక్షల కోట్ల నష్టం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత స్టాక్ మార్కెట్లు, టాటా గ్రూప్ ఇన్వెస్టర్లకు కిందటి ఏడాది చుక్కలు చూపించాయి. టాటా గ్రూప్ సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లకు పైగా క్షీణించింది. దీనితో ఇన్వెస్టర్లు భారీ నష్టాలు చవిచూశారు. సాల్ట్ నుంచి ఏవియేషన్ వరకు, ఐటీ నుంచి టెలికాం, విద్యుత్ నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు దాదాపు అన్ని రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న టాటా గ్రూప్‌నకు చెందిన 24 కంపెనీల్లో, 18 కంపెనీల షేర్లు గత ఏడాదిలో గరిష్ఠంగా 60 శాతం వరకూ పడిపోయాయి. ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) భారీ నష్టాలు చవిచూడటంతో, టాటా గ్రూప్ మార్కెట్ విలువ మొత్తం రూ.5,14,619 కోట్లు తగ్గింది. 2024 చివర్లో రూ.14,83,145 కోట్లుగా ఉన్న టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్, 2025 చివరికి రూ.11,63,107 కోట్లకు తగ్గింది. ఒక్క ఏడాదిలోనే టీసీఎస్ మార్కెట్ విలువ రూ.3,20,038 కోట్లు క్షీణించగా, షేరు ధర 22 శాతం పడిపోయింది. అమెరికా టారిఫ్‌ల పెంపు, హెచ్ 1బీ వీసా ఫీజుల పెరుగుదల వంటి అంతర్జాతీయ పరిణామాలు టీసీఎస్‌తో పాటు టాటా గ్రూప్ ఐటీ వ్యాపారాలపై ప్రతికూల ప్రభావం చూపినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం టాటా గ్రూప్‌నకు మార్కెట్ పరంగా నిరాశాజనకంగా మారింది. అయితే భారత్‌లో టాప్ కంపెనీల్లో చాలావరకు తమ మార్కె

## సీఎం సోదరుడికి సిట్ నోటీసులు



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణను సిట్ వేగవంతం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి, సిట్ బుధవారం నోటీసులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు గుర్తించిన అధికారులు, ఆ వివరాలను సేకరించేందుకు ఆయనను విచారణకు రావాలని కోరారు. కొండల్ రెడ్డికే కాకుండా, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య , జైపాల్ యాదవ్ లకు కూడా సిట్ నోటీసులు ఇచ్చింది. మునుగోడు ఉప ఎన్నికలు, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిందితులతో వీరు జరిపిన సంభాషణలపై అధికారులు ఆరా తీస్తున్నారు. వీరితో పాటు ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండల్ రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్‌లకు కూడా నోటీసులు అందాయి. ఎస్ఐబీ మాజీ అధికారులు ఇచ్చిన వాంగ్మూలాలు, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికల ఆధారంగా సిట్ ఈ చర్యలు చేపట్టింది. ప్రధాన నిందితుడు, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు విచారణలో వెల్లడించిన అంశాల ప్రాతిపదికన ఈ నోటీసుల పర్వం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఎలా వినియోగించుకున్నారనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా ఛార్జ్ షీట్‌ను దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు చేస్తోంది.

**సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు**

...::: పూర్తి కథనం 6వ పేజీలో..

మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
08.01.2026
www.manasarkar.com

# జాగృతి: తెలుగు గడ్డపై జాతీయవాద గొంతుక



**మొదటిపేజీ తరువాయి...**
మృత్యువు నీడలో వెలిగించిన ఒక "అఖండ జ్యోతి" ఈ వారపత్రిక.
అందుకే జాగృతిని ఒక పత్రికగా మాత్రమే చూడలేం. అదొక "వైచారిక విప్లవం".
తెలుగు వారి ఆత్మగౌరవం అణచివేయబడుతున్నప్పుడు, దానికి ఊపిరి పోసిన సంజీవని.
నిజాం నిరంకుశత్వం నుంచి మొదలుకొని, ఎమర్జెన్సీ చీకట్ల వరకు, నేటి సోషల్ మీడియా విషప్రచారం వరకు...
గత 75 ఏళ్లుగా, తెలుగు గడ్డపై రాజీపడని "జాతీయవాద గొంతుక"గా నిలిచిన ఈ పత్రిక ప్రస్థానాన్ని, దాని వెనుక ఉన్న త్యాగధనుల చరిత్రను ఇందులో తెలుసుకుందాం.
ఆవిర్భావం - నిజాంపై అక్షర యుద్ధం: కత్తిపై సాము... నెత్తుటి మడుగులో వెలిగిన అక్షర దీపం!
1948 నాటికి హైదరాబాద్ సంస్థానంలో పరిస్థితి ఎలా ఉందంటే... "గోడలకు కూడా చెవులు ఉండేవి". నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో, కాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపై పడి బీభత్సం సృష్టిస్తున్నారు.
అయితే, ఈ భౌతిక దాడుల కన్నా ప్రమాదకరమైనది మరొకటి ఉంది. అదే "సమాచార దిగ్బంధనం".
నిజాం ప్రభుత్వం బయట ప్రపంచానికి ఏమీ తెలియకుండా చేసింది. "హైదరాబాద్ ప్రజలు నిజాం పాలనలో చాలా సంతోషంగా ఉన్నారు, వారికి ఇండియన్ యూనియన్ లో కలవడం ఇష్టం లేదు" అనే పచ్చి అబద్ధాన్ని ప్రచారం చేస్తోంది.
అప్పటికే ఉన్న స్థానిక పత్రికలపై కఠినమైన ఆంక్షలు ఉన్నాయి. నిజం కు వ్యతిరేకంగా రాస్తే పత్రికను సీల్ వేసేవారు, ఎడిటర్ ని జైల్లో వేసేవారు.
ఈ "శ్మశాన నిశ్శబ్దాన్ని" బద్దలు కొట్టడానికి పుట్టిన గర్జనే... "జాగృతి".
దీని ఆవిర్భావం మరియు పోరాటాన్ని నాలుగు కీలక కోణాల్లో చూడవచ్చు:

**1. స్థాపన - సంఘ్ సంకల్పం (The Origin)**
భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది, కానీ హైదరాబాద్ కు రాలేదు. ఈ ప్రాంత విముక్తి కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) అప్పటికే క్షేత్ర స్థాయిలో పోరాటం చేస్తోంది.
- **ఆవశ్యకత:** క్షేత్ర స్థాయిలో పోరాడే కార్యకర్తలకు, సామాన్య ప్రజలకు అసలు సిసలైన వార్తలు అందాలి. వారిలో ధైర్యం నింపాలి. అందుకోసం ఒక సొంత పత్రిక ఉండాలని సంఘ్ నిర్ణయించింది.
- **నామకరణం:** ఆ పత్రికకు "జాగృతి" (Awakening) అని పేరు పెట్టారు. అంటే నిద్రపోతున్న లేదా భయంతో ముడుచుకుపోయిన తెలుగు జాతిని మేల్కొలపడమే దీని లక్ష్యం.
- **ఇది** లాభాల కోసం పెట్టిన వ్యాపారం కాదు; ఇది విముక్తి పోరాటంలో ఒక ఆయుధం.

2. రహస్య ముద్రణ అజ్ఞాత ప్రస్థానం
జాగృతిని ముద్రించడం ఆ రోజుల్లో ఒక పెద్ద సాహసం.
- **అధికారికంగా** ప్రెస్ నడపడానికి అనుమతి లేదు.
- **వ్యూహం:** అందుకే రహస్య ప్రదేశాల్లో, పాడుబడ్డ ఇళ్లల్లో, రాత్రి వేళల్లో దీపం వెలుతురులో ట్రెడిల్ మిషన్లపై లేదా సైక్లోస్టైల్ మిషన్లపై పత్రికను ముద్రించేవారు.
- **పేపర్** ఎక్కడ కొన్నారు? సిరా ఎక్కడ తెచ్చారు? అని పోలీసులు ఆరా తీసేవారు. వాటన్నింటినీ దాటుకుని, ప్రతి వారం పత్రిక ముద్రితమయ్యేది.

**3. పంపిణీ - ప్రాణాలకు తెగించి...**
పత్రిక ముద్రించడం ఒక ఎత్తైతే... దానిని ప్రజలకు చేరవేయడం మరో ఎత్తు.
- **రజాకార్లు** చెక్ పోస్టుల దగ్గర ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసేవారు. చేతిలో ప్రభుత్వ వ్యతిరేక కరపత్రం కనిపిస్తే అక్కడికక్కడే కాల్చి చంపేవారు.
- **సాహస బాలురు:** సంఘ్ లోని యువ కార్యకర్తలు (టీనేజర్లు) ఈ బాధ్యత తీసుకున్నారు.
- **పత్రికలను** కూరగాయల బుట్టల అడుగున, సైకిల్ సీట్ల కింద, లేదా చొక్కా లోపల దాచుకుని గ్రామాలకు తీసుకెళ్ళేవారు.
- **ఒక గ్రామం** నుంచి మరో గ్రామానికి "గుండె ధైర్యం"తో ఈ వార్తలను మోసుకెళ్లారు. పట్టుబడితే ప్రాణం పోతుందని తెలిసినా వెనకడుగు వేయలేదు.

**4. కంటెంట్ - అగ్ని అక్షరాలు**
**జాగృతిలో వచ్చే వార్తలు ఎలా ఉండేవి?**
- **"భారత సైన్యం** వస్తోంది... అధైర్య పడవద్దు."
- **"రజాకార్ల** దురాగతాలను ఎదిరించండి."
- **సర్దార్ పటేల్** హెచ్చరికలు, ఇండియన్ యూనియన్ సందేశాలు.
- **ఈ వార్తలు** చదివి ప్రజల్లో నమ్మకం పెరిగేది. "మనం ఒంటరి వాళ్ళం కాదు, మొత్తం దేశం మన వెనుక ఉంది" అనే భరోసాను జాగృతి ఇచ్చింది.
- **నిజాం** రేడియో (Deccan Radio) చెప్పే అబద్ధాలను జాగృతి పటాపంచలు చేసేది.

1948 సెప్టెంబర్ 17న "పోలీస్ యాక్షన్" (Operation Polo) జరిగి హైదరాబాద్ కు స్వాతంత్ర్యం వచ్చే వరకూ... జాగృతి పోషించిన పాత్ర వెలకట్టలేనిది.
**అది కేవలం వార్తలను అందించలేదు;**
మృత్యువు అంచున ఉన్న ప్రజలకు "జీవన ఉత్సాహాన్ని" అందించింది.
నిజాం తుపాకీ గుండు కన్నా... జాగృతి అక్షరం బలంగా పేలింది.
ఆనాడు ఆవిర్భవించిన ఆ "చిన్న పత్రిక"...
ఒక మహా సామ్రాజ్యాన్ని (నిజాం) కూల్చడంలో తనదైన కీలక పాత్ర పోషించింది.
భావజాల సంఘర్షణ - ఎర్ర కోటలో కాషాయ జెండా: దిగుమతి సిద్ధాంతంపై... దేశీయ ధర్మం చేసిన పోరాటం!
1948లో నిజాం పాలన అంతమైంది. కానీ, వెంటనే తెలుగు నేల మీద మరో రకమైన ఆధిపత్యం మొదలైంది. అదే "కమ్యూనిస్టు భావజాల ఆధిపత్యం".
1950 నుంచి 1990 వరకు... దాదాపు నాలుగు దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యం, సినిమా, మీడియా, మరియు యూనివర్సిటీలు (ముఖ్యంగా ఉస్మానియా, ఆంధ్రా యూనివర్సిటీలు) పూర్తిగా వామపక్షాల గుప్పిట్లో ఉండేవి.
ఆ రోజుల్లో... "నువ్వు మేధావివి (Intellectual) అనిపించుకోవాలంటే, కచ్చితంగా కమ్యూనిస్ట్ అయి ఉండాలి లేదా దేవుడిని తిట్టాలి" అనే ఒక అలిఖిత నిబంధన ఉండేది.
భారతీయ ఇతిహాసాలను హేళన చేయడం, రష్యా చైనా విప్లవాలను కీర్తించడం ఒక "ఫ్యాషన్" గా మారింది.
అటువంటి సమయంలో... "కాదు! మన మూలాలు విదేశాల్లో లేవు; ఈ మట్టిలో ఉన్నాయి" అని గట్టిగా చెప్పిన ఏకైక గొంతుక... "జాగృతి".
ఈ భావజాల సంఘర్షణను నాలుగు ప్రధాన కోణాల్లో విశ్లేషించవచ్చు:

**1. ఏకపక్ష కథనాలకు చెక్ (Breaking the One-Sided Narrative)**
ఆనాటి ప్రధాన పత్రికలు, వారపత్రికలు అన్నీ కమ్యూనిస్టు రచయితల చేతిలో ఉండేవి.
- **వారు** శ్రీరాముడిని "భూర్జువా" అని, భారతీయ సంస్కృతిని "మూఢనమ్మకం" అని రాసేవారు. పాఠకులు వేరే దారి లేక దాన్నే నిజమని నమ్మే పరిస్థితి.
- **జాగృతి ప్రవేశం:** ఈ ఏకపక్ష దాడిని జాగృతి అడ్డుకుంది.
- **"కార్ల్ మార్క్స్** పుట్టకముందే మనకు చాణక్యుడు ఉన్నాడు. లెనిన్ కంటే గొప్ప ప్రజా నాయకుడు ఛత్రపతి శివాజీ ఉన్నాడు" అని ఆధారాలతో సహా వ్యాసాలు ప్రచురించింది.
- **యువత** మెదళ్ళలో నింపబడుతున్న "ఆత్మన్యూనతా భావాన్ని" (Inferiority Complex) తొలగించి, వారిలో "జాతీయతా భావాన్ని" నింపింది.

**2. అంటరానివారైన జాతీయవాద రచయితలకు వేదిక (Platform for Nationalist Writers)**
ఆ రోజుల్లో ఎవరైనా రచయిత దేవుడి గురించి గానీ, దేశభక్తి గురించి గానీ రాస్తే... ప్రధాన పత్రికలు వారిని బహిష్కరించేవి. వారి రచనలను ప్రచురించేవి కాదు.
- **విశ్వనాథ** సత్యనారాయణ వంటి మహా కవులను కూడా "పాత చింతకాయ" అని హేళన చేసేవారు.
- **జాగృతి అండ:** అటువంటి సమయంలో, జాతీయవాద భావాలు కలిగిన రచయితలకు, కవులకు, విశ్లేషకులకు "జాగృతి" ఒక అమ్మలా ఆశ్రయం ఇచ్చింది.
- **"మీరు రాయండి...** మేము ముద్రిస్తాం" అని ప్రోత్సహించింది.
- **దీనివల్ల** తెలుగు నాట ఒక బలమైన "జాతీయవాద సాహిత్యకారుల తరం" (Generation of Nationalist Writers) తయారైంది. వారు వామపక్ష కవుల "విప్లవ సాహిత్యాన్ని" తమ "భావ కవిత్వం/ధార్మిక సాహిత్యం"తో ధీటుగా ఎదుర్కొన్నారు.

**3. నక్సలిజం - రొమాంటిసిజం కాదు, రక్తపాతం (Exposing Naxalism)**
1970, 80వ దశకాల్లో నక్సలిజం (Naxalism) పతాక స్థాయిలో ఉంది. సినిమాల్లో, నవలల్లో నక్సలైట్లను "హీరోలు"గా చూపించేవారు. కాలేజీ విద్యార్థులు చదువు మానేసి అడవుల్లోకి వెళ్ళడం గొప్పగా ఫీలయ్యేవారు.
- **జాగృతి కౌంటర్:** జాగృతి ఈ "రొమాంటిసిజం" (Romanticism) ముసుగును తొలగించింది.
- **"తుపాకీ గొట్టం** ద్వారా వచ్చేది విప్లవం కాదు... వినాశనం" అని కుండబద్దలు కొట్టింది.
- **నక్సలైట్ల చేతి**లో చనిపోతున్న అమాయక గిరిజనుల, పోలీసుల కుటుంబాల రోదనను జాగృతి బయటపెట్టింది.
- **అభివృద్ధిని** అడ్డుకుంటున్నది ప్రభుత్వాలు కాదు, అడవుల్లో ఉన్న ఈ "ఎర్ర దొరలే" అని సాక్ష్యాలతో సహా నిరూపించింది. ఇది ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తెచ్చింది.

**4. రష్యా కాదు... ఋషులు ముఖ్యం (Rishis over Russia)**
కమ్యూనిస్టులు "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అని నినదిస్తే... జాగృతి "హిందువులారా ఏకం కండి... భారతీయులారా మేల్కొనండి" అని నినదించింది.
- **దిగుమతి** చేసుకున్న సిద్ధాంతాలు మన దేశానికి పనికిరావని, మన మట్టి వాసన కలిగిన "ఏకాత్మతా మానవతావాదం" (Integral Humanism) మాత్రమే మనకు రక్ష అని జాగృతి ప్రచారం చేసింది.
- **దీన్** దయాల్ ఉపాధ్యాయ, గురూజీ గోల్వాల్కర్ వంటి వారి సిద్ధాంతాలను సరళమైన తెలుగులో అనువదించి పల్లెపల్లెకూ చేర్చింది.

తెలుగు గడ్డపై కమ్యూనిజం అనే "ఎర్ర కోట" బలంగా ఉన్న రోజుల్లో... దాని బురుజుల మీద "కాషాయ జెండా"ను ఎగరేసిన సాహసం జాగృతిది.
అది కేవలం రాజకీయ పోరాటం కాదు;
అది భారతీయ "ఆత్మ" (Soul) కోసం జరిగిన పోరాటం.
ఆనాడు జాగృతి చేసిన ఆ "వైచారిక యుద్ధం" వల్లే... నేడు తెలుగు నాట జాతీయవాదం ఒక బలమైన శక్తిగా ఎదిగి నిలబడింది.
ఆ విజయానికి తొలి బీజం... జాగృతి అక్షరమే!
సాహితీ సేవ - తెలుగుదనానికి పట్టాభిషేకం: సిరా చుక్కలతో... సంస్కృతికి అలంకారం!
సాధారణంగా ఒక సిద్ధాంతానికి (Ideology) కట్టుబడిన పత్రికలు కేవలం ఆ సిద్ధాంత ప్రచారానికే పరిమితమవుతాయి. వాటిలో సాహిత్యం, కళలు నామమాత్రంగా ఉంటాయి.
కానీ, "జాగృతి" విషయంలో ఇది పూర్తిగా విరుద్ధం.
ఈ పత్రిక "రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్" (RSS) భావజాలాన్ని మోస్తూనే... మరో భుజం మీద "తెలుగు సాహిత్యాన్ని" (Telugu Literature) మోసింది.
గత 75 ఏళ్లుగా, తెలుగు నాట కమ్యూనిస్టు సాహిత్యం (అభ్యుదయ/విప్లవ సాహిత్యం) రాజ్యమేలుతున్న రోజుల్లో... దానికి ధీటుగా "జాతీయవాద సాహిత్యాన్ని", "సనాతన ధార్మిక సాహిత్యాన్ని" బతికించిన ఏకైక వేదిక జాగృతి.
ఈ సాహితీ యజ్ఞాన్ని నాలుగు సుందరమైన కోణాల్లో ఆవిష్కరించవచ్చు:

**1. దీపావళి ప్రత్యేక సంచిక - ఒక సాంస్కృతిక ఉత్సవం (The Legendary Deepavali Edition)**
తెలుగు సాహితీ ప్రియులకు దీపావళి పండుగ అంటే రెండు విషయాలు గుర్తుకొస్తాయి. ఒకటి బాణసంచా, రెండోది "జాగృతి దీపావళి సంచిక".
- **విశిష్టత:** వందల పేజీలతో, రంగుల ముఖచిత్రంతో (Cover Page), మందపాటి పుస్తకంలా వచ్చే ఈ సంచిక కోసం పాఠకులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసేవారు.
- **కంటెంట్:** అందులో వచ్చేవి కేవలం రాజకీయ వ్యాసాలు కాదు. ప్రముఖ రచయితల కథలు, కవితలు, ఆధ్యాత్మిక వ్యాసాలు, కార్టూన్లు, మరియు సాహిత్య విమర్శలు ఉండేవి.
- **పదిలపరుచుకునే నిధి:** సాధారణ పేపర్ ను చదివి పారేస్తారు. కానీ జాగృతి దీపావళి సంచికను బైండింగ్ చేయించి, గ్రంథాలయాల్లో దాచుకునేవారు. అది ఒక "కలెక్టర్స్ ఐటమ్" (Collector's Item).
- **అప్పట్లో** "ఆంధ్ర పత్రిక", "భారతి" వంటి పత్రికల సరసన నిలబడగలిగిన స్థాయి (Standard) జాగృతికి ఉండేది.

**2. వామపక్ష గుత్తాధిపత్యానికి గండి (Breaking the Leftist Monopoly)**
195080 మధ్య కాలంలో తెలుగు సాహిత్యం అంటే కేవలం "శ్రీశ్రీ" (Sri Sri) వారసత్వం, విప్లవ కవిత్వం అనే ముద్ర ఉండేది.
- **దేవుడి** గురించి రాస్తే "మూర్ఖత్వం" అనేవారు. పురాణాల గురించి రాస్తే "వెనుకబాటుతనం" అనేవారు.
- **జాగృతి కౌంటర్:** ఈ ఆధిపత్యాన్ని జాగృతి బద్దలు కొట్టింది.
- **"సాహిత్యం** అంటే కేవలం కడుపు మంట మాత్రమే కాదు; మనసు ప్రశాంతత కూడా" అని నిరూపించింది.
- **విశ్వనాథ** సత్యనారాయణ, నోరి నరసింహ శాస్త్రి, దివాకర్ల వెంకటావధాని వంటి దిగ్గజాలకు జాగృతి పెద్దపీట వేసింది. వారి పద్యాలను, వ్యాసాలను ప్రచురించి... "సాంప్రదాయ సాహిత్యం ఎప్పటికీ చనిపోదు" అని చాటిచెప్పింది.

**3. అచ్చ తెలుగుకు రక్షణ కవచం (Guardian of Pure Telugu)**
వార్తా పత్రికల భాష మారుతూ వచ్చింది. ఇంగ్లీష్ పదాలు కలిసిన "టాంగుతెలుగు" (Tanglish) రాజ్యమేలుతున్న రోజులివి.
- **కానీ** జాగృతి తన భాషా ప్రమాణాలను ఎప్పుడూ తగ్గించుకోలేదు.
- **గ్రాంథికం** & వ్యావహారికం: చక్కటి వ్యావహారిక భాషను వాడుతూనే... వ్యాకరణ దోషాలు లేకుండా, సంస్కృత పదాల సౌరభంతో కూడిన భాషను జాగృతి వాడేది.
- **పత్రిక** చదివితే పాఠకుడికి తెలియకుండానే కొత్త తెలుగు పదాలు నేర్చుకునే అవకాశం దొరికేది.
- **పద్యానికి పట్టం:** పద్య నాటకాలు, అవధానాలు, ఛందస్సు (Prosody) గురించి ప్రత్యేక శీర్షికలు నడిపిన ఘనత జాగృతిది.

**4. కొత్త రచయితలకు 'తొలి అడుగు' (Launchpad for Writers)**
కేవలం లబ్ధ ప్రతిష్టులకే కాదు; జాగృతి కొత్త వారికి కూడా ద్వారాలు తెరిచింది.
- **గ్రామీణ** ప్రాంతాల్లో ఉన్న ఎంతోమంది ఔత్సాహిక రచయితలు, కవులు తమ మొదటి రచనను జాగృతిలో చూసుకుని మురిసిపోయారు.
- **"మీరు** రాయండి, మేమున్నాం" అని ఎడిటర్లు ఇచ్చే ప్రోత్సాహం వల్ల... ఎంతోమంది జాతీయవాద రచయితలు (Nationalist Writers) తయారయ్యారు.
- **వారే తర్వాతి** కాలంలో అనేక పుస్తకాలు రాసి, తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చారు.

రాజకీయ పత్రికలు చాలా ఉంటాయి. కానీ "సాహితీ పరిమళం" వెదజల్లే రాజకీయ పత్రికలు అరుదు.
జాగృతి ఆ అరుదైన కోవకు చెందినది.
అది తెలుగు వాడి "రాజకీయ చైతన్యాన్ని" (Political Consciousness) పెంచడమే కాదు; "సాంస్కృతిక అస్తిత్వాన్ని" (Cultural Identity) కూడా కాపాడింది.
అక్షరం అనేది ఆయుధమే కాదు; అది ఒక అందమైన ఆభరణం కూడా అని జాగృతి నిరూపించింది.
తెలుగు తల్లి మెడలో జాగృతి వేసిన "సాహితీ హారం" ఎప్పటికీ వాడిపోనిది!
ఎమర్జెన్సీ కాలం - అజ్ఞాత గళం: సంకెళ్లు వేసినా... ఆగని సత్యాగ్రహం!
1975, జూన్ 25. ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంపై "ఎమర్జెన్సీ" (Emergency) విధించింది.
ఆ మరుక్షణం నుంచే భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు రద్దయ్యాయి. అన్నిటికన్నా ముఖ్యంగా "పత్రికా స్వేచ్ఛ" (Freedom of Press) ఉరి తీయబడింది.
"వంగమంటే... సాష్టాంగ పడ్డ" ఆనాటి ప్రధాన మీడియా సంస్థల మధ్య... వెన్నుచూపని ధీరత్వంతో నిలబడిన పత్రిక "జాగృతి".
ఆర్ఎస్ఎస్ (RSS) పై నిషేధం విధించిన వెంటనే, దానికి సంబంధించిన జాగృతి కార్యాలయాన్ని కూడా పోలీసులు సీల్ చేశారు. సంపాదకులను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు.
ప్రభుత్వం అనుకుంది... "ఇక జాగృతి కథ ముగిసింది" అని.
కానీ, అక్కడే వారి అంచనా తప్పింది. ఆఫీసు మూతపడి ఉండవచ్చు, కానీ "ఆశయం" మూతపడలేదు.
ఆ 19 నెలల అజ్ఞాత పోరాటాన్ని నాలుగు ఉత్కంఠభరితమైన కోణాల్లో చూడవచ్చు:

**1. రూపం మారింది - లక్ష్యం మారలేదు (The Shapeshifter)**
పోలీసులు "జాగృతి" అనే పేరుతో పత్రిక వస్తే అరెస్ట్ చేస్తారు.
- **వ్యూహం:** అందుకే కార్యకర్తలు పత్రిక పేరు మార్చారు. ఒక్కోసారి "వాణి" అని, మరోసారి "విజయ" అని, ఇంకోసారి పేరు లేకుండా కేవలం కరపత్రంలా ముద్రించేవారు.
- **అజ్ఞాత ప్రెస్:** పెద్ద పెద్ద ప్రింటింగ్ మిషన్లు వాడితే శబ్దం వస్తుంది, కరెంట్ బిల్లు ద్వారా దొరికిపోతారు. అందుకే ఇళ్లలోని సెల్లార్లలో, రహస్య గదుల్లో "సైక్లోస్టైల్ మిషన్ల" (Cyclostyle Machines) ద్వారా ముద్రించేవారు.
- **ఒక గదిలో** పోలీసులు రైడ్ చేస్తే... మరో గది నుంచి పత్రిక వచ్చేది. ఈ "గెరిల్లా జర్నలిజం" చూసి పోలీసులకు మతిపోయేది.

**2. సెన్సార్‌షిప్ కు సవాల్ - నిజం చెప్పిన గొంతుక (Defying Censorship)**
ఆ రోజుల్లో ప్రధాన పేపర్లన్నీ ఇందిరా గాంధీ భజన చేసేవి. దేశంలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలిసేది కాదు.
- **జాగృతి పాత్ర:** జయప్రకాష్ నారాయణ్ (JP) ఎక్కడ అరెస్ట్ అయ్యారు? జార్జి ఫెర్నాండెజ్ ఏం చెప్పారు? జైల్లో సత్యాగ్రహుల పరిస్థితి ఏంటి? ఇలాంటి "నిషిద్ధ వార్తలను" (Banned News) జాగృతి ధైర్యంగా ప్రచురించేది.
- **ఆకాశవాణి** రేడియో అబద్ధాలు చెబుతుంటే... జాగృతి పత్రిక నిజాలను బద్దలు కొట్టేది.
- **ప్రజలు** ఈ చిన్న కాగితం ముక్క కోసం ఆశగా ఎదురుచూసేవారు. ఎందుకంటే అందులోనే "వాస్తవం" ఉండేది.

**3. పంపిణీ వ్యవస్థ - మరణంతో చెలగాటం (Deadly Delivery Network)**
ముద్రించడం ఒక ఎత్తైతే... పంపిణీ చేయడం మరొక ఎత్తు.
- **చేతిలో** పేపర్ దొరికితే "మిసా" (MISA) చట్టం కింద అరెస్ట్ చేస్తారు. బెయిల్ ఉండదు.
- **కొరియర్స్:** అయినా సరే, సంఘ్ స్వయంసేవకులు, విద్యార్థులు, మహిళలు ఈ బాధ్యత తీసుకున్నారు.
- **ఉదయం** పాల ప్యాకెట్ల మధ్యలో, న్యూస్ పేపర్ల మధ్యలో ఈ పత్రికను పెట్టి ఇళ్లలో వేసేవారు.
- **బస్సుల్లో,** రైళ్లలో సీట్ల మీద వదిలి వెళ్ళేవారు. గోడల మీద అతికించి మాయమయ్యేవారు.
- **ఈ "హ్యూమన్** నెట్‌వర్క్" (Human Network) ఎంత బలంగా ఉందంటే... ఇంటెలిజెన్స్ వర్గాలకు కూడా వీరి ఆచూకీ దొరికేది కాదు.

**4. ఆర్థిక కష్టాలు - ప్రజలే పోషకులు (Public Support)**
ఆఫీసు లేదు, ప్రకటనలు (Ads) లేవు, అమ్మడానికి వీల్లేదు. మరి పేపర్, సిరా కొనడానికి డబ్బులు ఎక్కడివి?
- **ఇక్కడే** తెలుగు వారి అభిమానం బయటపడింది.
- **సామాన్య** ప్రజలు, వ్యాపారులు రహస్యంగా విరాళాలు ఇచ్చేవారు. "మా కోసం నిజం రాస్తున్నారు, ఆగకండి" అని పిడికెడు బియ్యం, రూపాయి నాణేలు ఇచ్చి ఆదుకున్నారు.
- **జాగృతి** ఆనాడు బతికింది కార్పొరేట్ ఫండింగ్ మీద కాదు; "ప్రజా ఫండింగ్" (Crowd Funding) మీద.

ఎమర్జెన్సీ చీకట్లలో... జాగృతి ఒక "మిణుగురు పురుగు".
అది ఇచ్చిన వెలుగు చిన్నదే కావచ్చు.
కానీ, చిమ్మచీకటిలో దారి వెతుక్కునే బాటసారికి ఆ వెలుగే ప్రాణాధారం.
పెద్ద పెద్ద మీడియా సంస్థలు మోకరిల్లిన చోట... జాగృతి నిలబడింది.
ఆనాడు అది చేసిన పోరాటమే... నేడు దానికి "విశ్వసనీయత" (Credibility) అనే కిరీటాన్ని పెట్టింది.
చరిత్రలో ఆ 19 నెలల కాలం... జాగృతి ప్రస్థానంలో "స్వర్ణ అధ్యాయం".
నేటి ఆవశ్యకత - ఫేక్ న్యూస్ పై యుద్ధం: అబద్ధాల వేగంపై... నిజం చేస్తున్న నిశబ్ద విప్లవం!
1948లో శత్రువు స్పష్టంగా కనిపించేవాడు (నిజాం/రజాకార్లు). చేతిలో తుపాకీ ఉండేది.
కానీ 2024లో శత్రువు కనిపించడు. వాడి చేతిలో తుపాకీ లేదు; "స్మార్ట్ ఫోన్" ఉంది.
నేడు మనం "పోస్ట్‌ట్రూత్" (PostTruth) ప్రపంచంలో బతుకుతున్నాం. నిజం కన్నా అబద్ధం వెయ్యి రెట్లు వేగంగా ప్రయాణిస్తోంది.
సోషల్ మీడియా (వాట్సాప్, ట్విట్టర్, ఫేస్బుక్) వేదికగా దేశంపై, ధర్మంపై ఒక "సైకలాజికల్ వార్" (Psychological War) జరుగుతోంది.
ఈ డిజిటల్ సునామీలో... నిలకడగా, నిజాయితీగా, ఆధారాలతో సహా వార్తలను అందించే "జాగృతి" పాత్ర గతంలో కంటే ఇప్పుడు మరింత అవసరం.
ఈ ఆధునిక యుద్ధంలో జాగృతి పోషిస్తున్న పాత్రను నాలుగు కోణాల్లో విశ్లేషించవచ్చు:

**1. 'బ్రేకింగ్ న్యూస్' తొందర లేదు - లోతైన విశ్లేషణే ముఖ్యం (Depth over Speed)**
మెయిన్ స్ట్రీమ్ మీడియాలో ఇప్పుడు "TRP" పిచ్చి పట్టింది. నిజం నిర్ధారణ చేసుకోకుండానే "బ్రేకింగ్ న్యూస్" వేసేస్తున్నారు.
- **జాగృతి శైలి:** కానీ జాగృతి ఆ రొప్పులో పడదు.
- **ఒక** సంఘటన జరిగితే... అది ఎందుకు జరిగింది? దాని వెనుక ఉన్న శక్తులు ఎవరు? దాని చారిత్రక నేపథ్యం ఏంటి? అని కూలంకషంగా పరిశోధించి వ్యాసాలు రాస్తుంది.
- **టీవీ** డిబేట్లలో అరుపులు, కేకలు విని విసిగిపోయిన పాఠకుడికి... జాగృతి ఇచ్చే "లోతైన విశ్లేషణ" (Indepth Analysis) ఒక ఔషధంలా పనిచేస్తుంది.

**2. హిందూ వ్యతిరేక నెరేటివ్ పై సర్జికల్ స్ట్రైక్ (Countering Anti-Hindu Narrative)**
ఈ రోజుల్లో హిందూ పండుగలను, ఆచారాలను కించపరచడం సోషల్ మీడియాలో ఒక ఫ్యాషన్ అయిపోయింది.
- **"దీపావళికి** టపాసులు కాల్చొద్దు కాలుష్యం వస్తుంది (కానీ మిగతా పండుగలకు పర్లేదు)", "రాఖీ పౌర్ణమి పితృస్వామ్యం" అంటూ విషం చిమ్ముతున్నారు.
- **జాగృతి కౌంటర్:** ఈ నెరేటివ్ ను జాగృతి గణాంకాలతో, శాస్త్రీయ ఆధారాలతో తిప్పికొడుతుంది.
- **అయోధ్య** రామమందిరం మొదలుకొని, కాశీ విశ్వనాథుడి వరకు... హిందువుల పక్షాన నిలబడి, వారి వాదనకు "మేధోపరమైన బలం" (Intellectual Backing) ఇస్తుంది.
- **సామాన్య** హిందువు సోషల్ మీడియాలో వాదించడానికి అవసరమైన "కంటెంట్"ను జాగృతి అందిస్తుంది.

**3. యువతకు దిక్సూచి (Compass for the Confused Youth)**
నేటి యువత రీల్స్ (Reels) ప్రపంచంలో బతుకుతోంది. వారికి చరిత్ర పట్ల అవగాహన తక్కువ. దీనిని దేశ వ్యతిరేక శక్తులు వాడుకుంటున్నాయి.
- **"భారతదేశం** బాగోలేదు, విదేశాలే గొప్పవి" అనే భావజాలాన్ని యువతలోకి ఎక్కిస్తున్నారు.
- **జాగృతి బాధ్యత:** ఈ తప్పుడు చరిత్రను చెరిపేసి... "నువ్వు పుట్టింది సామాన్యమైన దేశంలో కాదు; ఇది విశ్వగురు పీఠం" అని యువతకు గుర్తుచేస్తోంది.
- **దేశభక్తి** అంటే పాతకాలపు చాదస్తం కాదు; అది "కూల్" (Cool) అని నేటి తరాన్ని ఒప్పించేలా జాగృతి తన డిజిటల్ ప్రెజెన్స్ ను కూడా పెంచుకుంటోంది.

**4. విశ్వసనీయతే బ్రాండ్ (Trust is the Brand)**
సోషల్ మీడియాలో వచ్చే వార్తను నమ్మాలా వద్దా అని సందేహం వస్తుంది. డీప్ ఫేక్స్ (Deep Fakes) వచ్చాక కళ్లతో చూసింది కూడా నమ్మలేని పరిస్థితి.
- **కానీ,** జాగృతిలో ఒక వార్త వచ్చిందంటే... అది "నిజం" అయి తీరుతుంది.
- **75 ఏళ్లుగా** ఆ పత్రిక సంపాదించుకున్న ఆస్తి ఒక్కటే... "విశ్వసనీయత" (Credibility).
- **ఈ గందరగోళ** ప్రపంచంలో... "ఏది ధర్మం? ఏది అధర్మం?" అని సందిగ్ధంలో ఉన్నవారికి జాగృతి ఒక ప్రామాణిక గ్రంథంలా నిలుస్తోంది.

టెక్నాలజీ మారుతోంది, మాధ్యమాలు మారుతున్నాయి. కానీ అబద్ధం యొక్క స్వభావం మారలేదు.
నాడు రజాకార్లు తుపాకీతో భయపెడితే... నేడు అర్బన్ నక్సల్స్ (Urban Naxals) పెన్నుతో, కీబోర్డుతో దాడి చేస్తున్నారు.
ఈ యుద్ధంలో గెలవాలంటే... మన దగ్గర కూడా ఒక బలమైన ఆయుధం ఉండాలి.
తెలుగు వాడి చేతిలో ఉన్న ఆ అక్షరాయుధమే... "జాగృతి".
ఫేక్ న్యూస్ అనే చీకటిని పారద్రోలే... నిత్య "జాగృతి".
పత్రిక కాదు... ఇదొక ఉద్యమం!: కాగితంపై ముద్రించిన అక్షరాలు కాదు... జాతి గుండెపై చెక్కిన ఆశయాలు!
సాధారణంగా ఒక పత్రిక (Newspaper) జీవిత కాలం ఎంత?
ఉదయం వేడివేడిగా కాఫీతో పాటు చదువుతాం. మధ్యాహ్నానికి అది పాతబడిపోతుంది. సాయంత్రానికి అది చెత్తబుట్టలోనో, ప్యాకింగ్ కవరుగానో మారిపోతుంది.
కానీ, "జాగృతి" విషయంలో ఇది జరగదు.
జాగృతిని ఎవరూ చదివి పారేయరు; దాచుకుంటారు.
ఎందుకంటే... మిగతా పత్రికలు "వార్తలను" (News) అమ్ముతాయి. కానీ జాగృతి "విలువలను" (Values) పంచుతుంది.
గత 75 ఏళ్లుగా, వ్యాపార సూత్రాలకు (Business Logic) అందకుండా, కేవలం సిద్ధాంత బలం మీద నడుస్తున్న ఈ పత్రిక... తెలుగు గడ్డపై ఒక అద్భుతం.
దీనిని మూడు శక్తివంతమైన సందేశాలతో ఆవిష్కరించవచ్చు:

**1. లాభనష్టాలకు అతీతమైన యజ్ఞం (Mission over Margin)**
ఈ రోజుల్లో మీడియా అనేది ఒక పెద్ద కార్పొరేట్ వ్యాపారం. ఎవరికి లాభం వస్తే వారి వార్తలు రాస్తారు.
- **కానీ** జాగృతి స్థాపించినప్పటి నుంచి నేటి వరకు... "దీని వల్ల ఎంత డబ్బు వచ్చింది?" అని లెక్కలు వేసుకోలేదు. "దీని వల్ల దేశానికి ఎంత మేలు జరిగింది?" అనే లెక్కనే చూసుకుంది.
- **ఎంతోమంది** కార్యకర్తలు తమ సొంత డబ్బులు ఖర్చుపెట్టి, చెప్పులు అరిగేలా తిరిగి చందాలు వసూలు చేసి ఈ పత్రికను బతికించారు.
- **ఇది కేవలం** ఒక ప్రెస్ లో ముద్రించిన కాగితాల కట్ట కాదు; వందలాది మంది స్వయంసేవకుల "త్యాగాల మూట". అందుకే దీనికి అంత పవిత్రత ఉంది.

2. బౌద్ధిక క్షత్రియుడు (Intellectual Warrior)
దేశాన్ని కాపాడటానికి సరిహద్దులో సైనికులు (క్షత్రియులు) ఎలా అవసరమో...
దేశం లోపల మన సంస్కృతిని, ఆలోచనలను కాపాడటానికి "బౌద్ధిక సైనికులు" (Intellectual Warriors) అంతే అవసరం.
- **జాగృతి** చేస్తున్న పని అదే.
- **మన** పిల్లలు విదేశీ మోజులో పడిపోకుండా, మన చరిత్రను వక్రీకరించకుండా, మన దేవుళ్లను కించపరచకుండా... జాగృతి ఒక కాపలా సైనికునిలా పనిచేస్తోంది.
- **"నీ ధర్మం** గొప్పది, నీ చరిత్ర ఘనమైనది" అని ప్రతి వారం తెలుగు వాడి భుజం తట్టి చెప్పే స్నేహితుడు జాగృతి.

**3. ఇంటింటికి అక్షరాయుధం (Weapon in Every Home)**
తెలుగు ప్రజలకు ఒక విన్నపం.
మీ ఇంట్లో టీవీ ఉండవచ్చు, స్మార్ట్ ఫోన్ ఉండవచ్చు. కానీ, వాటితో పాటు కచ్చితంగా ఉండాల్సింది "జాగృతి".
- **ఎందుకంటే...** టీవీ మీ పిల్లలకు వినోదాన్ని ఇస్తుంది. కానీ జాగృతి మీ పిల్లలకు "వివేకాన్ని" ఇస్తుంది.
- **రేపు పొద్దున** మీ పిల్లలు "నా దేశం గొప్పతనం ఏంటి?" అని అడిగితే... గూగుల్ లో వెతకడం కన్నా, ఇంట్లో ఉన్న జాగృతి పాత సంచికలు తీసి చూపిస్తే చాలు. వారికి సమాధానం దొరుకుతుంది.

**చివరి మాట:**
రజాకార్ల తూటాలకు ఎదురు నిలిచిన రొమ్ము...
ఎమర్జెన్సీ చీకట్లను చీల్చిన చూపు...
అబద్ధపు ప్రచారాలను వేటాడే కత్తి...
అదే మన "జాగృతి".
ఇది కేవలం చదవాల్సిన పత్రిక కాదు;
ప్రతి తెలుగు వాడు గుండెలకు హత్తుకోవాల్సిన "జాతీయ పతాకం".
కాలాన్ని బట్టి రూపం మారవచ్చు, కానీ దాని ఆత్మ మారదు.
తెలుగు గడ్డ ఉన్నంత కాలం...
జాతీయవాద గొంతుకై "జాగృతి" గర్జిస్తూనే ఉంటుంది.
"నిద్రపోయే జాతిని మేల్కొలిపేదే... జాగృతి!"
భారత్ మాతా కి జై!

రచన: భూక్యా గోపినాయక్

**ప్రతి తెలుగు వాడు గుండెలకు హత్తుకోవాల్సిన "జాతీయ పతాకం".**
**కాలాన్ని బట్టి రూపం మారవచ్చు, కానీ దాని ఆత్మ మారదు.**
**తెలుగు గడ్డ ఉన్నంత కాలం...**
**జాతీయవాద గొంతుకై "జాగృతి" గర్జిస్తూనే ఉంటుంది.**
**"నిద్రపోయే జాతిని మేల్కొలిపేదే... జాగృతి!"**
**భారత్ మాతా కి జై!**

## ...మా మిత్ర దేశమే

**మొదటిపేజీ తరువాయి.....**
వెనుజువెలాలో ఉన్న భారతీయ పౌరుల భద్రత తమకు ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని వెల్లడించారు. ప్రస్తుతం నెలకొన్న అస్థిర పరిస్థితుల దృష్ట్యా, అత్యవసరమైతే తప్ప భారతీయులు ఎవరూ వెనుజువెలాకు ప్రయాణించవద్దని కేంద్ర ప్రభుత్వం ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. జనవరి 3న అమెరికా డెల్టా ఫోర్సెస్ కారకాస్‌లో మదురో దంపతులను బంధించి వాషింగ్టన్‌కు తరలించిన విషయం తెలిసిందే. మదురోపై నార్కోటెర్రరిజం, డ్రగ్ ట్రాఫికింగ్ వంటి తీవ్ర ఆరోపణలను అమెరికా మోపింది. అయితే, న్యూయార్క్ కోర్టులో హాజరైన మదురో ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. తనను అమెరికా అపహరించిందని, తాను 'యుద్ధ ఖైదీ'ని అని ఆయన ప్రకటించుకున్నారు. వెనుజువెలాలోని చమురు నిల్వల కోసమే అమెరికా ఈ కుట్ర పన్నిందని మదురో మండిపడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ పరిణామాలు ఇప్పుడు పెను చర్చకు దారితీశాయి.

## తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీ

**మొదటిపేజీ తరువాయి....**
ఈ బదిలీల్లో భాగంగా తఫ్సీర్ ఇక్బాల్‌ను హైదరాబాద్ దక్షిణ రేంజ్ అదనపు సీపీగా, శ్వేతను ఉత్తర రేంజ్ జాయింట్ సీపీగా, విజయ్ కుమార్‌ను స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సీపీగా నియమించగా, సాధనా రష్మీ పెరుమాళ్ సిద్దిపేట కొత్త పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. నగర విస్తరణ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన జోన్ల వారీగా డీసీపీల నియామకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో సికింద్రాబాద్‌కు కె. రక్షిత, చార్మినార్‌కు కిరణ్ ప్రభాకర్, ఖైరతాబాద్‌కు శిల్పవల్లి, జూబ్లీ హిల్స్‌కు రమణా రెడ్డి, గోల్కొండకు చంద్ర మోహన్, రాజేంద్ర నగర్‌కు శ్రీనివాస్ , శంషాబాద్‌కు రాజేశ్‌లను డీసీపీలుగా నియమించారు. సైబరాబాద్ పరిధిలో కుత్బుల్లాపూర్‌కు ఎన్. కోటిరెడ్డి, కూకట్‌పల్లికి రితిరాజ్, శేరిలింగంపల్లికి సీహెచ్ శ్రీనివాస్‌లను కేటాయించగా, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్‌కు అనురాధ, ఉప్పల్‌కు సురేశ్ కుమార్, మల్కాజిగిరి జోన్‌కు శ్రీధర్‌లకు బాధ్యతలు అప్పగించారు. వీటితో పాటు కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో మహేశ్వరం జోన్‌కు కె. నారాయణ రెడ్డి, షాద్‌నగర్‌కు శిరీష, చేవెళ్లకు యోగేశ్ గౌతమ్‌లను డీసీపీలుగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఏప్రిల్ 1 నుంచి జనగణన



**మొదటిపేజీ తరువాయి....**
కోవిడ్ కారణంగా 2021లో వాయిదా పడిన ఈ లెక్కింపును తాజాగా 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్య రెండో దశలో జనాభా వివరాల సేకరణ పూర్తి చేసేలా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ దఫా జనగణనను పూర్తిగా డిజిటల్ విధానంలో, మొబైల్ యాప్‌ల ద్వారా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యంగా ఈ జనగణనతో పాటే కుల గణనను కూడా చేపట్టనున్నట్లు కేంద్రం వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# మైనర్లతో పాక్ గూఢచర్యం



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

పాకిస్తాన్ కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్న 15 ఏళ్ల బాలుడిని పఠాన్‌కోట్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై చేపట్టిన దర్యాప్తులో కొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఐఎస్ఐ ఏజెంట్లు భారత్‌లోని మైనర్లను ట్రాప్ చేసి, వారిని ఉగ్రవాద కార్యకలాపాలకు ఆకర్షించాలని కుట్రపట్టినట్లు గుర్తించినట్లు భారత్ పోలీసు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో హరియాణా, పంజాబ్, జమ్మూ కశ్మీర్ నుంచి 12 మంది, 25 మంది మైనర్లను ఐఎస్ఐ ఏజెంట్లు ట్రాప్ చేసినట్లు వివరించారు. వీరంతా 14 నుంచి 17 సంవత్సరాల వయస్సులో ఉన్నారు. పాక్ నుండి మైనర్ల ఫోన్‌లకు లింక్‌లు పంపి, వాటిని క్లిక్ చేయించినప్పుడు వారి ఫోన్లను క్లోన్ చేసి, వారితో సంబంధం లేకుండా వారి సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోలీసులు ప్రస్తుతం అదుపులో ఉన్న బాలుడి ఫోన్‌ను స్కాన్ చేసి, అతడు పాక్ ఉగ్రవాద సంస్థలతో పలుమార్లు సంప్రదింపులు జరిపినట్లు గుర్తించారు. అతడు సైనిక స్థావరాల వీడియోలను తీసి, భద్రతా కాన్వాయ్‌ల కదలికలను లీక్ చేస్తున్నట్లు సమాచారం . ఇటువంటి ప్రమాదకర ముఠాల చేతిలో పడకుండా పిల్లలను రక్షించుకోవాలంటే, తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని పోలీసు అధికారులు వెల్లడించారు.



# వెనెజువెలా స్టాక్ మార్కెట్ దూకుడు

**సంక్షోభం ప్రభావం లేదు**
**ఒక్క రోజే 50 శాతం పెరిగిన స్టాక్ మార్కెట్**
**దేశ ఆర్థిక రంగానికి కొత్త ఊపిరి**

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

వెనెజువెలాలో ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశంలో సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఇంత సంక్షోభంలో కూడా అక్కడి స్టాక్ మార్కెట్ దూకుడుగా దూసుకుపోతోంది. అమెరికా సైనిక దళాలు అమెరికాకు నికోలస్ మదురో అధ్యక్షుడిని, ఆయన భార్య సిలియా ఫ్లోరస్‌ను తీసుకెళ్లిన సంఘటన ప్రపంచ ఆర్థిక వర్గాలను ప్రభావితం చేసింది. అంతర్జాతీయంగా స్టాక్, చమురు మార్కెట్లు పతనం చెందగా, వెనెజువెలాలో కరాకస్ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ ఇండెక్స్ జనవరి 6న ఒక్కరోజులోనే 50 శాతానికి పైగా లాభాలతో అదరగొట్టింది. రెండు రోజుల వ్యవధిలో సూచీ 75 శాతానికి పైగా లాభపడటం విశేషం. ఇటీవల నెల రోజుల్లోనే స్టాక్ మార్కెట్ 162 శాతం, ఏడాది వ్యవధిలో 2,979 శాతం రికార్డు లాభాలు సంపాదించింది. ఈ లాభాలకు ప్రధానంగా మూడు కారణాలు చెప్తున్నారు ఆర్థిక నిపుణులు. అధ్యక్షుని మార్పు : నికోలస్ మదురో అరెస్ట్ తర్వాత విపక్ష నేత మారియా కోరినా మచాడో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడతారనే వార్తలతో పెట్టుబడిదారుల్లో ఆశలొచ్చాయి. కొత్త ప్రభుత్వం ఆర్థిక విధానాలను సవరిస్తుందని మార్కెట్ భావిస్తోంది. లిక్విడిటీ తక్కువగా ఉండడం : చిన్న దేశమైన వెనెజువెలా స్టాక్ మార్కెట్ లో షేర్ల కొనుగోలుదారులు తక్కువగా ఉన్నందున, కొద్దిసేపు భారీ కొనుగోళ్లు వచ్చినపుడు ధరలు అమాంతం పెరుగుతున్నాయి. చమురు ఎగుమతుల పెంపు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనెజువెలా నుంచి 2 బిలియన్ డాలర్ల విలువైన క్రూడాయిల్ దిగుమతులకు డీల్ ప్రకటించడంతో దేశ చమురు రంగానికి పునరుజ్జీవనం వస్తుందని విశ్లేషకులు ఊహిస్తున్నారు. పెట్టుబడిదారుల ఆశలు : నికోలస్ మదురోను అదుపులోకి తీసుకోవడం సహా దేశంలో రాజకీయ మార్పుల నేపథ్యంలో ఆర్థిక సంక్షోభం తొలగుతుందనే ఆశాభావం పెట్టుబడిదారుల్లో పెరిగింది. దీంతో అమెరికా ఆంక్షలు తొలగిపోయి సాధారణ పరిస్థితులు వస్తాయని.. చమురు ఎగుమతులు మళ్లీ పుంజుకుంటాయని భావిస్తున్నారు.




# లష్కరే -హమాస్ కమాండర్ల రహస్య భేటీ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఉగ్రవాద మద్దతు సంస్థలకు మూలవిరాట్ దేశంగా ముద్రపడిన పాకిస్తాన్ లో తాజాగా ఉగ్ర ముఠా లష్కరే తయ్యిబా , హమాస్ నేతలు సమావేశానికి వేదికగా మారింది. పాక్ లోని గుజ్రాన్‌వాలాలో పాకిస్తాన్ మర్కజే ముస్లిం లీగ్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్ తో లష్కరే తయ్యిబా కమాండర్ రషీద్ అలీ సంధు తో భేటీ అయినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి . హమాస్, లష్కరే తోయిబా ఉగ్రవాద నేతలు ఒకే వేదికగా సమావేశం కావడం గమనార్హం. ఈ పార్టీ లష్కరే తోయిబాకు రాజకీయంగా ప్రోత్సాహం అందిస్తోందని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. పాకిస్తాన్‌లో హమాస్ నేత నాజీ జహీర్ చేసిన పర్యటనలు, అతడు పాల్గొన్న భేటీలు ఆ దేశం లో ఉగ్రవాద సంస్థల మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని బలంగా వెల్లడిస్తున్నాయి. 2025 ఫిబ్రవరిలో పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ యాత్రలో జహీర్, లష్కరే తోయిబా, జైష్‌ఎమొహమ్మద్ నేతలతో కలిసి భారతదేశం వ్యతిరేకంగా సభలో ప్రసంగించాడు. ఈ ఘటనకు కొన్ని వారాల క్రితం పహల్గాం ఉగ్రదాడి జరగడం విశేషం. అంతకుముందు 2024 జనవరిలో కరాచీకి వెళ్లిన జహీర్, అక్కడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడాడు. అదే ఏడాది ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌కు వెళ్లి హైకోర్టు బార్ అసోసియేషన్ నుంచి సత్కారం అందుకున్నాడు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన దాడి తర్వాత వారం రోజుల్లోనే అతడు పాకిస్తాన్ కు వచ్చి, జమియత్ ఉలేమా ఎఇస్లాం అధినేత మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ తో భేటీ అయ్యాడు. అదే రోజు పేశావర్‌లో జరిగిన ముఫ్తీ మహ్మూద్ తో సమావేశమయ్యి అందులో ప్రసంగించాడు. ఆ సమావేశంలో హమాస్ మరో నేత ఖాలెద్ మషాల్ పాల్గొన్నాడు. తర్వాత అక్టోబర్ 29న బలోచిస్థాన్‌లోని క్వెట్టాలో నిర్వహించిన 'అల్ అక్సా స్టార్మ్' సమావేశంలో జహీర్ పాల్గొన్నాడు. నవంబర్ 2023లో కరాచీలో జరిగిన 'తూఫాన్‌ఎఅక్సా' సమావేశంలోనూ కనిపించాడు. ఈ వరుస పర్యటనలు, సమావేశాలు, పాకిస్తాన్ లో హమాస్ నేతలకు లభిస్తున్న బహిరంగ మద్దతు ఉగ్రవాద సంస్థలతో పెరుగుతున్న సమన్వయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

# మోదీ మంచోడే కానీ.. సర్ కలవచ్చాని అడిగారు

- భారత్ అపాచీ హెలికాప్టర్ల కొనుగోలు
- అపాచీపై మోదీ సంప్రదించారన్న ట్రంప్
- అదనపు టారిఫ్ లతో లాభమని వ్యాఖ్యలు



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికాలో తయారైన అపాచీ హెలికాప్టర్ల డెలివరీకి సంబంధించి భారత ప్రధాని తనతో నేరుగా సమస్యను ప్రస్తావించారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి మోదీ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను 'సర్' అని మోదీ సంబోధించారని , 'అంటే భారత్ నా దగ్గరకు వచ్చింది, సర్. నేను ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నాను.. మేము దానిని మారుస్తున్నాం' అని రక్షణ ఉత్పత్తులు, విదేశాలకు సైనిక సామాగ్రి విక్రయాల గురించి అధికారులతో బుధవారం జరిగిన రిపబ్లికన్ సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. మిత్రదేశాలు, భాగస్వాములకు కూడా ఆయుధాలను వేగంగా అందించాలని అమెరికా రక్షణ కంపెనీలను తన యంత్రాంగం ఒత్తిడి చేస్తోందని సమావేశంలో ట్రంప్ స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలంలో అమెరికా రక్షణ పరికరాలను ఎక్కువగా కొనుగోలు చేసిన దేశాలలో భారత్ ఒకటిగా ఉంది, వాషింగ్టన్‌తో క్రమంగా విస్తరిస్తున్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా రవాణా విమానాలు, హెలికాప్టర్లు, నిఘా వ్యవస్థలను కొనుగోలు చేసింది. 'భారత్ 68 అపాచీలను ఆర్డర్ చేసిన సందర్భంగా , భారత ప్రధాని మోదీ మంచి మిత్రుడంటూనే, నన్ను కలవడానికి వచ్చారు. సర్. దయచేసి నేను మిమ్మల్ని కలవవచ్చా? అని అడిగారు. అవును' అని అప్పటి సంభాషణను ట్రంప్ ప్రస్తావించారు. రక్షణ ఉత్పత్తులు, ఆయుధాలు అమెరికా సైన్యానికి, విదేశీ కొనుగోలుదార్లకు అందజేయడంలో జరుగుతోన్న జాప్యంపై ట్రంప్ ప్రస్తావించారు. "ఎఫ్35 యుద్ధ విమానాలు, అపాచీ హెలికాప్టర్లు తయారీకి ఎక్కువ సమయం పడుతోంది.. రక్షణ కాంట్రాక్ట్‌లు పొందిన పరిశ్రమలు తయారీ వేగవంతం చేయాలి' అని ట్రంప్ సూచించారు. అయితే , వాణిజ్య ఒప్పందాల్లో భాగంగా , తమ మధ్య సంబంధం దెబ్బతిన్నట్లు ట్రంప్ అంగీకరించారు. 'వారు ఇప్పుడు చాలా మొత్తంలో సుంకాలు చెల్లిస్తున్నారని మీకు తెలుసు కాబట్టి మోదీ నాతో అంతగా సంతోషంగా లేరు' అని ట్రంప్ తెలిపారు. భారత్ ప్రస్తుతం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడం తగ్గించిందని ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. అధిక సుంకాల విధింపు నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు సమర్ధించుకున్నారు. రష్యా చమురు దిగుమతులపై అమెరికా ఆందోళనలను పరిష్కరించకపోతే భారత్ వస్తువులపై సుంకాలను మరింత పెంచుతామని ట్రంప్ హెచ్చరికలు చేసిన మర్నాడే ఈ వ్యాఖ్యలు వచ్చాయి. భారత్ పై విధించిన టారీఫ్‌లతో అమెరికా ఆర్థికంగా ప్రయోజనం పొందుతుందని ట్రంప్ వివరించారు.

# భారత - వెనెజువెలా సంబంధాలపై ప్రభావమెంత ?



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

భారత్ చమురు సంస్థ ఓఎన్‌జీసీ, వెనెజువెలా ప్రభుత్వ చమురు సంస్థ 'పెట్రోలియోస్ డి వెనెజ్వెలా' (పీడీవీఎస్‌ఏ)తో 2005లో ఒక ఒప్పందంపై సంతకం చేసింది. అప్పటి వెనెజువెలా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ మాట్లాడుతూ, తమ దేశం అమెరికా మార్కెట్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్నట్టు, భారత్‌తో ఒప్పందం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణ అమెరికాలో వెనెజువెలా చమురు నిల్వలు ఉన్న దేశంగానే కాకుండా, అత్యంత పట్టణీకరణ చెందిన దేశాలలో ఈ ప్రాంతంలో ఒకటిగా ఉంది. లాటిన్ అమెరికన్ దేశాల్లో 21వ శతాబ్దపు అత్యంత ఆదరణ కలిగిన నాయకుడు చావెజ్ వారసుడిగా నికోలస్ మదురో 2013లో అధ్యక్షుడిగా పాలన చేపట్టారు. భారతదేశం ,వెనెజువెలామధ్య చమురు, వాణిజ్య సంబంధాలు విస్తృతమయ్యాయి. 2005లో సంతకం చేసిన ఒప్పందం ద్వారా, వెనెజువెలా నుండి భారత్ కు చమురు సరఫరా ప్రారంభమైంది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య ఉత్పాదక సంబంధాల దృష్టికోణంలో ప్రధాన పాత్ర పోషించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరిపాలనా యంత్రాంగం తనను అధికారం నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తోందని మదురో దీర్ఘ కాలంగా ఆరోపిస్తున్నారు. వెనెజువెలా చమురు నిల్వలు 300 బిలియన్ (30,000 కోట్ల) బ్యారెళ్లకు పైగా ఉన్నాయని అంచనా వేసింది. ప్రపంచంలోని మరే దేశంలోనూ ఈ స్థాయి చమురు నిల్వలు లేకపోవడం గమనార్హం. భారమైన ముడి చమురు. వెలికి తీయడం ఖరీదైనప్పటికి , వెనెజువెలా ప్రపంచంలో ఐదవ అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా కొనసాగుతోంది. అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఈఐఏ) ప్రకారం, 2023లో వెనెజువెలా ప్రపంచంలోని మొత్తం ముడి చమురులో 0.8% మాత్రమే ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం వెనెజువెలా ప్రతిరోజూ 9 లక్షల బ్యారెళ్ల ముడి చమురును ఎగుమతి చేస్తోంది. చైనా దాని అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. వెనెజువెలాలో చమురుతో పాటు ఖనిజాలు కూడా సమృద్ధిగా ఉన్నాయి. రాజధాని కారకస్‌లోని భారత రాయబార కార్యాలయం వెనెజువెలా మైనింగ్ రంగంపై 2016లో జరిగిన సర్వేను పంచుకుంది. బొగ్గుతో పాటు, ఉక్కు, అల్యూమినియం, నికెల్, మాంగనీస్, రాగి, జింక్ వంటి ఖనిజ నిల్వలు ఉన్నాయి. ఈ సర్వే ప్రకారం వెనెజువెలాలో 12 వేల మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం నిల్వలు నిక్షిప్తమై ఉన్నాయి. వెనెజువెలా లోని కల్లావో గ్రామం సంప్రదాయకంగా ఒక ప్రధాన బంగారు గనుల కేంద్రంగా వర్ధిల్లుతోంది. దేశంలో 4 మిలియన్ (40 లక్షల) టన్నుల బంగారం , 60 మిలియన్ టన్నుల అల్యూమినియం ఉన్నట్లు అంచనా వేస్తోంది. 10 బిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు సైతం ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. వెనెజువెలాలో ప్రధాన పంట కాఫీ. మొక్కజొన్న, వరి కూడా ఎక్కువగానే సాగుచేస్తారు. ప్రధాన వ్యవసాయ ప్రాంతాలు ఉత్తర పర్వతాలు, దిగువ ప్రాంతాలు. 21వ శతాబ్దపు తొలి దశాబ్దాలలో వెనెజువెలాలో ఆర్థిక నిర్వహణ క్రమంగా లేదు. ద్రవ్యోల్బణం, నిత్యవసర వస్తువుల కొరత, నిరుద్యోగం, నేరాల వంటి సమస్యలతో సతమతమవుతోంది. ఫలితంగా దాదాపు 70 లక్షల మంది వెనెజువెలా ప్రజలు పొరుగు దేశాలకు వలసబాట పట్టారు. అమెరికాతో వైరం వెనెజువెలా పాలకుల శత్రుత్వంగా కొనసాగింది. ట్రంప్ హయాంలో ఈ వైరం మరింత పెరిగింది. మదురో ప్రభుత్వం, అమెరికా నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. 2018లో జరిగిన అధ్యక్ష ఎన్నికలను పక్షపాతంతో జరిగినట్లుగా అమెరికా ఆరోపించింది. ఈ ఎన్నికల్లో మదురో గెలిచినా, అమెరికా అనేక ఇతర దేశాలు మదురో గెలుపును గుర్తించలేదు. వెనెజువెలాలో ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్నా, చమురు నిల్వలు, ఖనిజాలు, అలాగే శరణార్థుల సమస్యలతో సహా వివిధ అంశాలు దేశం యొక్క భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయి. అమెరికాతో సంబంధాలు, రాజకీయ ప్రతిపక్షాలతో విబేధాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

# చైనాలో ఫోన్ పోగొట్టిన...జపాన్ అణు ఉద్యోగి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

జపాన్ అణు నియంత్రణ సంస్థలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి చైనా పర్యటనలో తన ఫోన్‌ను పోగొట్టుకున్న ఘటన వెలుగుచూసింది. ఈ ఫోన్‌లో కీలక సమాచారమూ, జపాన్ అణు నియంత్రణ సంస్థలో పని చేస్తున్న సిబ్బందికి సంబంధించిన కాంటాక్టు వివరాలు ఉన్నట్లు జపాన్ మీడియా వెల్లడించింది. ఈ సమాచారాన్ని లీక్ చేశారా లేదా అన్న విషయంపై అణు నియంత్రణ సంస్థ నుంచి ఇంకా స్పష్టత రాలేదు. ఈ సంఘటన నవంబర్ 3న షాంఘై విమానాశ్రయంలో జరిగినట్లు భావిస్తున్నారు. భద్రతా తనిఖీల సమయంలో ఈ ఉద్యోగి తన ఫోన్‌ను కోల్పోయారు. మూడు రోజుల తరువాత ఫోన్ పోయినట్టు



గమనించారు. ఎయిర్‌పోర్టు సిబ్బందిని సంప్రదించినా, ఫలితం లేకుండా పోవడంతో ఈ ఘటన బయటకువచ్చింది. జపాన్ ప్రభుత్వం భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని భావిస్తోంది. 2011లో ఫుకుషిమా అణు కేంద్రం ఘోర ప్రమాదానికి గురైన తర్వాత, జపాన్ ప్రభుత్వం అణు విద్యుత్ రియాక్టర్లను మూసివేయాలని నిర్ణయించింది. ఫుకుషిమా ఘటన తర్వాత అణు భద్రత కాపాడడానికి అణు నియంత్రణ సంస్థ (ఎన్ఆర్ఏ)ను ఏర్పాటుచేసింది. ఈ సంస్థ అణు రియాక్టర్ల పునఃప్రారంభం, భద్రతను పర్యవేక్షిస్తుంది. మరోవైపు , జపాన్‌లోని అణు నియంత్రణ సంస్థకు సంబంధించిన భద్రతా లోపాలు తేలిన సంఘటనగా అభిప్రాయపడుతున్నారు. కాషీవాజాకి కరీవా అణు కేంద్రంలో కూడా పత్రాలు పోగొట్టుకుపోయినవి. 2023లో చుబు ఎలక్ట్రికల్ పవర్ అణు ప్లాంట్‌కు సంబంధించిన ఒక భద్రతా స్కాండల్ కూడా వెలుగులోకి వచ్చింది.

# తనకే దిక్కులేదు.. బంగ్లాకు ఫైటర్ జెట్లు హామీ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

మింగ మెతుకు లేదు...మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా ఉంది పాక్ తీరు. సొంత రక్షణ వ్యవస్థనే కాపాడుకోలేక పోయిన పాకిస్తాన్ ఇప్పుడు బంగ్లాదేశ్‌కు ఆయుధాలు ఇస్తానని ముందుకొస్తోంది. యుద్ధం చేసేందుకు దిక్కులేదు గాని , బంగ్లాదేశ్‌కు యుద్ధ విమానాలు అమ్మడానికి పాక్ అత్యుత్సహం ప్రదర్శిస్తోంది. పాక్ తయారు చేసిన JF17 థండర్ యుద్ధ విమానాల కొనుగోలుపై బంగ్లాదేశ్ ఆసక్తి చూపడం ప్రస్తుతం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ధాటికి పాకిస్తాన్ ఖంగుతిని కాళ్లబేరానికి వచ్చిన సంగతి విదితమే. పాక్‌భారత్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతల సందర్భంగా, 2025 మే నెలలో JF17 యుద్ధ విమానాల పనితీరును బంగ్లాదేశ్ పరిశీలించింది. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ప్రదర్శించిన శక్తి, పాకిస్తాన్ కీలకమైన ఎయిర్‌బేస్‌లు ధ్వంసమైన సంగతి విదితమే. ఈ నేపథ్యం వలన, బంగ్లాదేశ్ ప్రస్తుతం తన వైమానిక దళాన్ని ఆధునీకరించుకునేందుకు పాకిస్తాన్ నుండి 16 నుండి 24 JF17 బ్లాక్ III యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతోంది. పాక్ వైమానిక దళం చీఫ్ జహీర్ అహ్మద్ బాబర్ సిద్ధూ, బంగ్లాదేశ్ వైమానిక దళ చీఫ్ హసన్ మహమూద్ ఖాన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో చర్చలు జరిపారు. ఇందులో JF17 యుద్ధ విమానాల విక్రయానికి సంబంధించిన వివరాలు ప్రధానంగా చర్చించబడ్డాయి. ఈ ఒప్పందం విలువ సుమారు 400 నుంచి 700 మిలియన్ డాలర్ల మధ్య ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. బంగ్లాదేశ్, గతంలో తన రక్షణ అవసరాలకు రష్యా, చైనా మీద ఆధారపడేది. కానీ ఇప్పుడు పాకిస్తాన్‌తో కొత్త రక్షణ ఒప్పందాలు కుదుర్చుకోవడం, సరిహద్దుల్లో ఉమ్మడి వ్యూహాలు రూపొందించడం, భారత్‌కు భద్రతా పరమైన సవాలుగా మారే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.






# హాదీ హత్యకు సింగపూర్‌లో ప్రణాళిక

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

బంగ్లాదేశ్‌లో విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ హత్య ప్రణాళికపై ముఖ్య సమాచారాన్ని వెలుగులోకి వచ్చింది. ఈ హత్య రాజకీయ ప్రతీకార చర్య కారణంగా, సింగపూర్ లో హత్య ప్రణాళిక జరిగిందని బంగ్లాదేశ్ పోలీసులు తాజాగా వెల్లడించారు. ఈ కేసులో 17 మందిని నిందితులుగా చేర్చుతూ ఢాకా మెట్రో పాలిటన్ పోలీసులు న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. హాదీ తన సోషల్ మీడియా వేదికగా అవామీలీగ్, ఛత్రా లీగ్ వంటి గ్రూప్‌లపై తీవ్ర విమర్శలు చేసినందున ఆగ్రహంతో ఈ హత్య జరిగిందని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. హత్య ప్రణాళిక కోసం జరిగిన సమావేశంలో తైజుల్‌తో పాటు మాజీ ఎంపీ ఎలియాస్ మొల్లా, జహంగీర్ కబీర్ నాయక్, షూటర్ ఫైజల్ కరీం మసూద్ పాల్గొన్నారని పేర్కొన్నారు. హాదీపై కాల్పులు జరిపిన వ్యక్తి ఫిలిప్ కూడా వీరి లోపల ఉన్నాడని చెప్పారు. అవామీలీగ్‌కు చెందిన విద్యార్థి విభాగం మాజీ నాయకుడు. కాల్పులు జరిపిన వారిలో ఫిలిప్ అనే వ్యక్తి కూడా ఉన్నాడని చెప్పారు. వీరిద్దరితో పాటు ప్రధాన నిందితుడు అలంగీర్ షేక్ పరారీలో ఉన్నారన్నారు. 32 ఏళ్ల హాదీ, 2024 జులైలో షేక్ హసీనాకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటులో ప్రధాన పాత్ర పోషించాడు. హాదీపై 2023 నవంబర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపడంతో, చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు విడిచాడు. ఈ హత్యతో బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులు పెరిగాయి.




# వీసాలపై భారతీయ విద్యార్థులకు హెచ్చరిక

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

భారతీయ విద్యార్థులకు అమెరికా రాయబార కార్యాలయం కీలక హెచ్చరికలు జారీ చేసింది. స్టూడెంట్ వీసాలు హక్కు కాదని, అది ఒక ప్రత్యేక గౌరవం మాత్రమే అని స్పష్టం చేసింది. వీసాలు తీసుకున్న విద్యార్థులు అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరించింది. నిబంధనలను పాటించకపోతే, వీసాలు రద్దు చేయడం, స్వదేశాలకు తరలించడం, కొంతకాలం బ్లాక్‌లిస్టులో పెట్టడం, లేదా అరెస్టు చేయడం వంటి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఎవరూ అమెరికాకు రాకుండా నిషేధం కూడా విధిస్తామని అమెరికా రాయబార కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. భారతీయ విద్యార్థులతో పాటు విదేశీ విద్యార్థులు కూడా స్థానిక చట్టాలను గౌరవించాలని సూచించింది. అమెరికా ఇటీవల స్టూడెంట్ వీసాలపై కఠిన నిబంధనలను అమలు చేస్తూ, వర్కింగ్, టూరిస్ట్, బిజినెస్ వీసాల విషయంలో కూడా కఠినతర చర్యలు తీసుకుంటామని అమెరికా రాయబార కార్యాలయం పేర్కొంది. ఇది ట్రంప్ పాలనలో చేసిన మార్పులకు ఒక భాగమని, ప్రస్తుతం ఈ నిబంధనలను అమలు చేయడంలో కఠినమైన నిబంధనలు అమలు చేయనున్నట్లు తెలిపింది.



# ప్లీజ్ అంటూ.. మేక్రాన్ ప్రాధేయపడ్డారు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్‌పై హేళనగా వ్యాఖ్యానించారు. రిపబ్లికన్ చట్టసభ సమావేశంలో మాట్లాడుతూ, ట్రంప్ గతంలో ఫ్రాన్స్ మేక్రాన్‌ను ఉద్దేశించి చేసిన ఓ చర్చను ప్రస్తావించారు. "ఫ్రాన్స్ ఔషధ ధరలను మూడింతలు పెంచాలని అడిగాను. ఆయన మొదట అంగీకరించలేదు. దాంతో, ఆ దేశం నుండి దిగుమతి అవుతున్న వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించాను. అప్పుడు మేక్రాన్ ఈడీగా అడిగాడు... 'డొనాల్డ్ మన మధ్య ఒప్పందం ఉంది. ఔషధాల ధరలను పెంచుతాను, కానీ మా ప్రజలకు చెప్పకండి' అని ప్రాధేయపడ్డాడు" అని ట్రంప్ చెప్పారు. ఫ్రాన్స్ లో ఔషధాల ధరలు తక్కువగా ఉండటంతో, అవి అమెరికాలో ఎక్కువగా విక్రయించేవి. అమెరికా కంపెనీలకు నష్టం వాటిల్లడంతో, ట్రంప్ సూచన మేరకు ఫ్రాన్స్ ఆ ధరలను పెంచింది. ఈ మార్పు, అమెరికా ఔషధాలకు డిమాండ్ పెరగడాన్ని వైద్య నిపుణులు పేర్కొన్నారు. అయితే, ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై మేక్రాన్ లేదా ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇక, రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై విధించిన సుంకాల గురించి కూడా ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు.

మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
08.01.2026
www.manasarkar.com



## రాజధాని రైతులకు రుణమాఫీ

**గుంటూరు జిల్లా (ఏడీఎన్ఎన్) :**

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వడ్డమానులో రెండో విడత భూసమీకరణ ప్రక్రియను మంత్రి నారాయణ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈనెల 6 వరకు రూ.1.50లక్షల వరకు రైతులు తీసుకున్న రుణాలను వర్తింపజేస్తూ మాఫీ చేయనున్నామని అధికారికంగా ప్రకటించారు. రాబోయే మూడేళ్లలో అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా ప్రాంగణం పూర్తిచేయాలని సీఎం చెప్పారని, అదేవిధంగా రైతుల కౌలు పెంచేందుకు సీఎంతో నేను మాట్లాడితే ఆయన ప్రాథమికంగా అంగీకరించారని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, రాజధాని నిర్మాణానికి అడ్డుపడిన జగన్‌కు ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పారని, ఆయన చేసిన అన్యాయంపై రైతులు నిరసన తెలిపారని చెప్పారు. రాజధానిలో రెండో విడత భూసమీకరణ సందర్భంగా, వడ్డమానులో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్థికపరమైన అంశాల్లో కేంద్రాన్ని ఒప్పించి సీఎం చంద్రబాబు నిధులు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అన్ని విధాలుగా ఆయన కృషి చేస్తున్నారని చెప్పారు. రాజధాని అభివృద్ధిని వైకాపా ప్రభుత్వం అడ్డుకుందని, ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.



## డిప్యూటీ సీఎంకు ఎంపీ ఫిర్యాదు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్ర సచివాలయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో, మధ్యప్రదేశ్ మాండ్లా ఎంపీ ఫగ్గన్ సింగ్ కులస్తే భేటీ అయ్యారు. అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం పరిధిలోని సదుంలో మధ్యప్రదేశ్ వాసులు గ్రానైట్ మైనింగ్ కోసం అనుమతులు పొందారని, అయితే స్థానిక నాయకులు మైనింగ్ ప్రక్రియను అడ్డుకుంటున్నారని కులస్తే, పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు.ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ మైనింగ్ ఎలా చేస్తారంటూ బెదిరింపులకు దిగుతున్నారని పవన్ కళ్యాణ్ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన పవన్ కళ్యాణ్ పుంగనూరులో ఉంటున్న మధ్యప్రదేశ్ వాసులపై బెదిరింపు చర్యలకు పాల్పడే వారిపై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. అనుమతులు ఉన్న వారు నిబంధనల ప్రకారం, మైనింగ్ చేసుకునే ప్రక్రియను అధికార యంత్రాంగం చూస్తుందని, సదుంలో అనుమతులు పొందిన వారే మైనింగ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ ఫగ్గన్ సింగ్ కులస్తేకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.రాష్ట్రాలు, ప్రాంతాలు వేరైనా మనమంతా భారతీయులమని, ఏ రాష్ట్రం వారు దేశంలో ఏ రాష్ట్రాల్లో అయినా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. అలాగే ఏ రాష్ట్రానికి చెందిన వారైనా, ఎక్కడైనా పనులు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. స్థానికేతరుల పేరుతో అనుమతులు ఉన్నా పనులు చేయకుండా అడ్డు తగిలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.



## పోలవరం పనులను గడువులోగా పూర్తి చేయాలి

**పోలవరం (ఏడీఎన్ఎన్) :**

పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. బుధవారం ప్రాజెక్ట్ సైట్ వద్ద జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన ఆయన ప్రాజెక్టులో మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టులో ఇప్పటికే 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం కోరారు. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించి పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేస్తూ, కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతానికి కూడా నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. వచ్చే మే నెల మొదటి వారంలో తాను మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## త్వరలో ఫిషింగ్ హార్బర్, బందరు పోర్టు పూర్తి

**మచిలీపట్నం (ఏడీఎన్ఎన్) :**



మచిలీపట్నంలో రూ. 39 కోట్లతో రహదారుల శంకుస్థాపన కార్యక్రమాల్లో బుధవారం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఫిషింగ్ హార్బర్, బందరు పోర్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి, మచిలీపట్నం రోడ్ల ప్రతిపాదనలను జాతీయ రహదారుల సంస్థ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్లు పరిపాలించిన వైసీపీ ప్రభుత్వం హయాంలో, ఆర్ అండ్ బీ శాఖ ఉందా అనేలా రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం పరిశ్రమల్ని తరిమేస్తే, కూటమి పార్టీ నేతృత్వంలో పెట్టుబడి పెడతామని పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని వ్యాఖ్యానించారు. రూ. 20 లక్షల ఉద్యోగాలిస్తామన్న హామీ మేరకు పరిశ్రమలను ఏపీకి తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులున్నా, సంక్షేమం, అభివృద్ధిని విస్మరించకుండా ముందుకెళ్తున్నామని, ఏ సంబంధం లేని కేసుల్లో టీడీపీ నేతల్ని అరెస్టు చేసి పైశాచికానందం పొందారని బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు.నియోజకవర్గం అభివృద్ధికి ఇంత తపించే మంత్రి కొల్లు రవీంద్రను గెలిపించుకోవడం మీ అందరి అదృష్టమన్నారు. మచిలీపట్నంలోని వైసీపీ దుర్మార్గుల పట్ల పోరాడి కలబడి నిలబడ్డామని, ఉనికిని కాపాడుకోవడానికి మైకులు పట్టుకుని పిచ్చిగా వాగినంత మాత్రాన ప్రజలు మద్దతివ్వరని వైసీపీపై ఫైర్ అయ్యారు. గత ఐదేళ్లు విధ్వంసం, దాడులు, కేసులు, హత్యలు తప్ప ఇంకేమీ లేదంటూ మండిపడ్డారు. ప్రజల కోసం పని చేసిన నాయకుడికి, ఆ ప్రభుత్వానికి మాత్రమే మనుగడ ఉంటుందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు.



## కేటీఆర్ కు జై కొట్టిన జగన్ ఫ్యాన్స్

- ఖమ్మం బీఆర్ఎస్ ర్యాలీలో వైసీపీ జెండాల రెపరెపలు
- కూసుమంచి వద్ద కేటీఆర్‌కు వైసీపీ శ్రేణుల ఘనస్వాగతం

**ఖమ్మం (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభిమానులు బుధవారం ఘనస్వాగతం పలికారు.ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో కేటీఆర్ కాన్వాయ్ ప్రవేశించగానే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహిస్తుండగా, అనూహ్యంగా అక్కడ వైసీపీ జెండాలు ప్రత్యక్షమయ్యాయి. గులాబీ జెండాల మధ్య వైసీపీ ఫ్యాన్ గుర్తు జెండాలు రెపరెపలాడటం అందరినీ ఆశ్చర్యపరిచింది.కేవలం జెండాలతోనే సరిపెట్టకుండా, వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. "జై జగన్.. జై కేటీఆర్" అంటూ రెండు పార్టీల నేతలను కలిపి చేసిన నినాదాలతో నాయకన్‌గూడెం మార్మోగింది. వైఎస్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న ఖమ్మం జిల్లాలో, కేటీఆర్ టూర్‌లో జగన్ ఫ్యాన్స్ సందడి చేయడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇటీవల బెంగళూరులో జరిగిన ఒక ప్రైవేట్ వేడుకలో కేటీఆర్, జగన్ మోహన్ రెడ్డి కలవటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ సమయంలో జగన్‌ను 'అన్న' అని సంబోధిస్తూ కేటీఆర్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయ్యింది. అదేవిధంగా, తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం వద్ద కేసీఆర్, కేటీఆర్ కటౌట్లు అభిమానులు పెట్టడం కూడా రెండు పార్టీల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యానికి సంకేతంగా కనిపిస్తోంది.

## వడ్డమానులో మంత్రిని నిలదీసిన గ్రామస్తులు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**




అమరావతి పరిధిలోని వడ్డమాను గ్రామసభ గందరగోళంగా మారింది. వడ్డమానులో బుధవారం నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న మంత్రి నారాయణను రైతులు నిలదీశారు. అమరావతి రాజధానిగా చట్టబద్ధంగా కొనసాగుతోందా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని, ఇప్పటివరకు అమరావతిలో మొదటి విడత అభివృద్ధి ఎంతవరకు జరిగిందంటూ సూటిగా ప్రశ్నించారు. భూసమీకరణకు ముందు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదని, కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదని వడ్డమాను గ్రామ రైతులు మంత్రి ఎదుట ఆందోళనకి దిగారు.అయితే వడ్డమాను గ్రామంలో 1,937 ఎకరాలు, ఎండ్రాయి గ్రామంలో 2,166 ఎకరాలు భూ సమీకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసి నోటిఫికేషన్లు ఇచ్చినట్లు, మొత్తం ఏడు గ్రామాల్లో కలిపి 16,666 ఎకరాల ల్యాండ్ పూలింగ్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు అధికారులు గ్రామసభలో వెల్లడించారు.అయితే రైతులు మాత్రం గత అనుభవాలను గుర్తు చేస్తూ, మరోసారి భూములు ఇచ్చే ముందు పూర్తి హామీలు కావాలని స్పష్టం చేశారు. అమరావతి భవిష్యత్తుపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామసభలో జరిగిన పరిణామాలు అమరావతి భూసమీకరణ ప్రక్రియపై రైతుల్లో ఇంకా అనుమానాలు, అసంతృప్తి కొనసాగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**గుంటూరు జిల్లా (ఏడీఎన్ఎన్) :**

గుంటూరు జిల్లా వడ్లమూడిలోని ఒక ప్రైవేట్ యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య ఘటన తీవ్ర కలకలం రేపింది. తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన రాఘవేంద్ర వెంకట్ బీటెక్ (కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్) మూడో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం తరగతులు జరుగుతున్న సమయంలో రాఘవేంద్ర క్లాస్ మధ్యలో బయటకు వెళ్లి, క్యాంపస్‌లోని టాయిలెట్‌లోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు.ఈ ఘటనతో యూనివర్సిటీ క్యాంపస్ విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయగా, యూనివర్సిటీ యాజమాన్యం తరగతులను తాత్కాలికంగా నిలిపివేసింది.సహ విద్యార్థులు, సిబ్బంది వెంటనే స్పందించి మంటలను ఆపడానికి ప్రయత్నించారు. తీవ్రంగా గాయపడ్డ రాఘవేంద్రను గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతిచెందిన విద్యార్థి రాఘవేంద్ర శరీరంపై కాలిన గాయాలున్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ముద్దుకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరనారాయణ తెలిపారు.



## శాశ్వత రాజధానిపై పార్లమెంట్‌లో బిల్లు



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌కి శాశ్వత రాజధానిగా అమరావతిని చేసేందుకు పార్లమెంట్ సమావేశాల్లో కానీ, వచ్చే సమావేశాల్లో గానీ బిల్లు పెడతామంటూ బుధవారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పన్నెండేళ్ల నుంచి రాజధానిగా గుర్తించాలా, లేక ఇప్పటి నుంచి గుర్తించాలా అనే సాంకేతిక కారణాలతో ఆలస్యం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి బిల్లును మానిటర్ చేస్తుంటే, ఈ బిల్లుపై మాజీ సీఎం జగన్ విషం కక్కుతున్నారని ఫైర్ అయ్యారు. జగన్‌ను శాశ్వత రాజకీయ సమాధి చేయాలన్నారు. 34 వేల మంది రైతులు ఇచ్చిన భూములు వినియోగించుకోలేక ఏపీ భవిష్యత్‌ను నాశనం చేశారని కేంద్రమంత్రి దుయ్యబట్టారు. ప్రణాళికా బద్ధంగా అమరావతి అభివృద్ధి చేస్తున్నామని, అమరావతి బిల్లు సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమవుతుందని, వేల మంది అమరావతి నిర్మాణం పనిచేస్తున్నారని పెమ్మసాని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే 16 జాతీయ సంస్థల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని, హడ్కో ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందన్నారు. కాగ్, పోస్టల్ బిల్డింగ్, కేంద్రీయ విద్యాలయాలు అమరావతిలో ఏర్పాటవుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమరావతి నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని కేంద్రమంత్రి పెమ్మసాని పేర్కొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు, జరగనివ్వం

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**



విశాఖకు ఐటీ, ఫార్మా, డేటా సెంటర్లతో పాటు భారీ పరిశ్రమలు తరలివస్తున్నాయని, ఈ క్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై వస్తున్న వార్తలను ఖండించారు. ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖని తీర్చిదిద్దుతున్నామని నారా లోకేష్ బుధవారం ప్రకటించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు, జరగనివ్వం, అది మా ప్రభుత్వ నిబద్ధతని లోకేశ్ స్పష్టం చేశారు.ఒక పత్రికపై తాను దాఖలు చేసిన పరువు నష్టం కేసులో క్రాస్ ఎగ్జామినేషన్ కోసం కోర్టుకు హాజరయ్యారు. అనంతరం మీడియాతో లోకేశ్ మాట్లాడుతూ, పెద్ద కంపెనీలకు తక్కువ ధరకు భూములు కేటాయించడంపై ఆయన స్పందిస్తూ, మన యువతకు ఉద్యోగాలు రావాలన్నా, పెట్టుబడులు పెరగాలన్నా కంపెనీలకు రాయితీలు ఇవ్వడంలో తప్పులేదని లోకేశ్ అన్నారు. రాష్ట్రానికి టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు వస్తే ఆ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుంది. అలాంటప్పుడు ఉపాధి కల్పించే కంపెనీలకు రాయితీలిస్తే తప్పు లేదన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం మొత్తానికి వచ్చిన పెట్టుబడుల్లో ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాటానే 25.3 శాతంగా ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా వస్తున్న ప్రతి నాలుగు రూపాయల పెట్టుబడిలో ఒక రూపాయి ఏపీకే వస్తోందని,ఇదంతా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం వల్లే సాధ్యమైందన్నారు.ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఇతర రాష్ట్రాలతో కాకుండా ప్రపంచ దేశాలతోనే పోటీ పడుతోందని ధీమా వ్యక్తం చేశారు.ఇప్పటికే విశాఖలో ఐటీ, ఫార్మా, డేటా సెంటర్ల హబ్ సిద్ధమవుతోందని, రాబోయే పదేళ్లలో హైదరాబాద్ అభివృద్ధిని విశాఖ అధిగమిస్తుందని జోస్యం చెప్పారు. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు ఉత్తరాంధ్రను వేగంగా అభివృద్ధి చేయడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని లోకేష్ స్పష్టం చేశారు.భోగాపురం విషయంలో ఎర్రబస్సు ఆగని ఊరికి ఎయిర్‌పోర్టు అవసరమా? అని నాడు జగన్ ప్రశ్నించిన విషయాన్ని లోకేష్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అమరావతికి చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం దానిని ఏమీ చేయలేకపోయిందని, ఇప్పుడు అమరావతికి అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కావాలనే భూసేకరణ చేస్తున్నామని వివరించారు. పట్టిసీమ ప్రాజెక్టును దండుగ అన్న జగన్, గత ఐదేళ్లు అదే ప్రాజెక్టు నీటిని వాడుకున్నారని ఎద్దేవా చేశారు. సముద్రంలో కలిసే వేల టీఎంసీల గోదావరి జలాలను కాపాడి రాయలసీమకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల జల వివాదాలపై లోకేష్ సానుకూలంగా స్పందించారు.మేము తెలంగాణ ప్రాజెక్టులకు ఎక్కడా చిల్లు పెట్టలేదు. మిగిలిన నీటిని తెలంగాణ వాడుకోవచ్చు లేదా చెన్నైకి కూడా ఇవ్వవచ్చు, మాకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా కించపరిచేలా, తన గౌరవానికి భంగం కలిగించేలా కావాలనే అబద్ధపు వార్తలు రాశారని అందుకే న్యాయపోరాటం చేస్తున్నానన్నారు.ప్రభుత్వ సొమ్మును నా సొంత ఖర్చులకు వాడినట్లు ఒక పత్రిక రాసింది, అది పచ్చి అబద్ధమని ఆధారాలతో సహా నిరూపించా. నేను ఎప్పుడూ తప్పు చేయలేదు, చేసే ప్రసక్తే లేదని కొట్టిపారేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారు ఎవరైనా సరే వదిలిపెట్టేది లేదని లోకేశ్ హెచ్చరించారు. రాజకీయ విమర్శల పేరుతో మహిళలను, కుటుంబసభ్యులను లక్ష్యంగా చేసుకుని వేధించే సైకోల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.



## నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ మీడియా సమావేశం

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. కూటమి ప్రభుత్వంపై చేస్తోన్న అప్పుల పై ప్రధానంగా మాట్లాడే అవకాశం ఉండొచ్చని తెలుస్తోంది. చంద్రబాబు పథకాల్లో కోతలు , మోసాలు, రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు, వైసీపీ నేతలపై దాడులు, ఏకపక్షంగా పోలీసులు వ్యవహరిస్తోన్న తీరు, భోగాపురం ఎయిర్‌పోర్ట్ విషయంలో చంద్రబాబు క్రెడిట్ చోరీ తదితర సమకాలీన రాజకీయ అంశాలపై వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉందని వైస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ద్వారా తెలుస్తోంది.



## అభివృద్ధిపై జగన్ డ్రామాలు ఆపాలి

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ద్వంద్వ వైఖరిపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం క్రెడిట్ కోసం పాకులాడటం లేదని, కేవలం ప్రజా సేవ, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నామని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రాజెక్టులను ఎద్దేవా చేసిన వారు, ఇప్పుడు వాటి ఫలితాలను తమ ఖాతాలో వేసుకోవాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. "అధికారంలో ఉన్నప్పుడు ఎర్రబస్సు కూడా రాని గ్రామాలకు ఎయిర్ బస్ అవసరమా అని ప్రశ్నించిన వ్యక్తి జగన్. అలాంటి నాయకుడు నేడు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు క్రెడిట్ వైసీపీదేనని చెప్పుకోవడం ఎంతవరకు న్యాయం?," అని నిలదీశారు. నాడు అభివృద్ధిని అడ్డుకున్న వారే, నేడు ఆ పనులు పూర్తవుతుంటే తమ వల్లే జరిగాయని ప్రచారం చేసుకోవడం వారి నైజానికి నిదర్శనమని విమర్శించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ విషయంలో వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని లోకేష్ తిప్పికొట్టారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం జీఎంఆర్ సంస్థకు 2,600 ఎకరాలను అందజేసిందని ఆయన వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ కోసం 5వేల ఎకరాలు కేటాయిస్తే నాడు జగన్ విమర్శించారని గుర్తు చేశారు. కానీ నేడు బెంగళూరు వంటి నగరాల్లో స్థలం సరిపోక రెండో విమానాశ్రయం కోసం వెతుకుతున్న పరిస్థితిని చూసైనా జగన్ తన ఆలోచనా విధానం మార్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరు కష్టపడుతున్నారు, ఎవరు అడ్డుపడుతున్నారు అనేది ప్రజలకు స్పష్టంగా తెలుసని లోకేష్ అన్నారు. అభివృద్ధిని అడ్డుకున్న వారు ఇప్పుడు క్రెడిట్ కోసం ప్రయత్నించడం ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. కేవలం సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసినంత మాత్రాన వాస్తవాలు మారిపోవని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు కోసం మౌలిక వసతుల కల్పనలో వెనక్కి తగ్గేదే లేదని ఆయన తేల్చి చెప్పారు.



## ఎన్‌హెచ్‌ఏఐకి రెండు గిన్నిస్ రికార్డులు

**కడప (ఏడీఎన్ఎన్) :**

బెంగళూరు-కడప-విజయవాడ ఆర్థిక కారిడార్ (ఎన్‌హెచ్ 544జీ) పై, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఆధ్వర్యంలో ఎం/ఎస్ రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో రహదారి నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించి కేవలం 24 గంటల వ్యవధిలో 28.95 లేన్‌కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేయడంతో పాటు, 10,675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరంగా వేయడంతో రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ అసాధారణ విజయంపై బుధవారం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ ఖాతా ద్వారా స్పందించారు. ఇది భారత ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ప్రపంచస్థాయి హైవే మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్నాయని సీఎం అన్నారు. అలాగే ఈ విజయానికి కారణమైన ఇంజినీర్లు, కార్మికులు, ఫీల్డ్ సిబ్బంది అంకిత భావం ప్రశంసనీయమని, కఠినమైన (ఎన్‌హెచ్ఏఐ) నాణ్యత ప్రమాణాలను పూర్తిగా పాటిస్తూ పనులు చేపట్టడం అభినందనీయమని సీఎం అన్నారు.



# కేటీఆర్ బాషా మార్చుకో

### మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరుస ఓటములతో అసహనానికి లోనైన కేటీఆర్, ఏం మాట్లాడుతున్నారో తెలియని స్థితిలో ఉన్నారని విమర్శించారు. బుధవారం విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో పొన్నం మాట్లాడుతూ, దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని విమర్శిస్తే కేటీఆర్ గొప్పవాడు కాలేరని హితవు పలికారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ కేటీఆర్ వాడుతున్న భాష ఆయన వ్యక్తిత్వానికే మచ్చ అని మంత్రి మండిపడ్డారు. తన గౌరవాన్ని తానే తగ్గించుకుంటున్న కేటీఆర్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇకనైనా ఇటువంటి అసభ్యకరమైన భాషను మానుకోవాలని, లేదంటే కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా స్పందిస్తాయని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.




# వర్శిటీ భూములపై సర్కార్ కన్ను

### సీఎం పై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల భూములను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పదే పదే టార్గెట్ చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. విద్యాసంస్థల భూములను లాక్కోవడం వల్ల విద్య, పరిశోధనల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని ఆయన బుధవారం విమర్శించారు. 'ఎక్స్' వేదికగా హరీశ్ రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తొలుత ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్శిటీ, కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన వర్శిటీలకు చెందిన సుమారు 100 ఎకరాలకు పైగా భూమిని ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకుందని ఆరోపించారు. ఈ ప్రక్రియలో 60 ఏళ్లుగా ఎంతో విలువైన జన్యువనరులు, ఔషధ, సుగంధ మొక్కలతో ఉన్న పరిశోధనా కేంద్రం పూర్తిగా నాశనమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాలపై కన్నేసిన ప్రభుత్వం, ఇప్పుడు తాజాగా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ కి చెందిన 50 ఎకరాల భూమిని తీసుకోవాలని చూడటం విచారకరమని పేర్కొన్నారు. ఇవన్నీ విద్యాసంస్థలపై జరుగుతున్న వ్యవస్థీకృత దాడికి నిదర్శనమని మండిపడ్డారు.వర్శిటీ భూములను స్వాధీనం చేసుకోవడం వల్ల అటవీ ప్రాంతం దెబ్బతినడమే కాకుండా, అంతరించిపోతున్న వన్యప్రాణులకు, జీవవైవిధ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందని హరీశ్ రావు హెచ్చరించారు. విద్యా ఆవిష్కరణలు, పరిశోధనల కోసం కేటాయించిన భూమిని ప్రభుత్వం ఎందుకు వ్యర్థమని భావిస్తోందని ఆయన నిలదీశారు. తెలంగాణ భవిష్యత్తును నిర్మించాల్సిన ప్రభుత్వం జ్ఞానాన్ని పెంచాల్సింది పోయి, బుల్డోజర్లతో విద్యాసంస్థల ఉనికిని కూల్చడంలోనే ఆసక్తి చూపుతోందని దుయ్యబట్టారు.




# ఏసీబీ వలలో అవినీతి అధికారులు

### నందిగామ ఎంపీడీవో సహా ముగ్గురు అరెస్ట్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలోని పలు జిల్లాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం జరిపిన దాడుల్లో లంచం తీసుకుంటూ ఐదుగురు అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నందిగామ ఎంపీడీవో కార్యాలయంలో భవన నిర్మాణ అనుమతుల కోసం లంచం డిమాండ్ చేసిన ఎంపీడీవో సుమతి, ఏపీవో తేజ్ సింగ్, ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్యలను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలి ప్రవీణ్ అనే వ్యక్తి చేపట్టిన భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చేందుకు అధికారులు రూ. 3.5 లక్షలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు గతంలోనే రూ. లక్ష చెల్లించగా, బుధవారం మరో రూ. లక్ష తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలోని బృందం ముగ్గురినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది.మరో ఘటనలో, హైదరాబాద్ బాగ్ అంబర్‌పేటలోని దేవాదాయ శాఖ భూమికి సంబంధించిన సర్వే రిపోర్టు ఇచ్చేందుకు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అక్కవరపు కిరణ్ కుమార్ రూ. 1.50 లక్షలు డిమాండ్ చేశారు. బుధవారం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను కస్టడీలోకి తీసుకున్నారు. నిందితులందరినీ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు.

# వరంగల్ మన రెండో రాజధాని

**హనుమకొండ (ఏడీఎన్ఎన్) :**

వరంగల్ నగరాన్ని తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా తమ ప్రభుత్వం భావిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

బుధవారం హనుమకొండలో మంత్రి సీతక్కతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని స్పష్టం చేశారు.వరంగల్ నగరంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించేందుకు ప్రభుత్వం రూ.4,000 కోట్ల నిధుల విడుదలకు అనుమతినిచ్చిందని మంత్రి వెల్లడించారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ఇందుకు కృషి చేసిన కలెక్టర్ మరియు రెవెన్యూ అధికారులను ఆయన అభినందించారు.నగరంలో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక సౌకర్యాలతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే, భద్రకాళి ఆలయ పునరుద్ధరణ పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లను, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నిరుపేదలకు అందజేస్తామని హామీ ఇచ్చారు.కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, ఇన్నర్ రింగ్ రోడ్డు భూసేకరణ సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




# హైదరాబాద్‌లో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

### సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో అంతర్జాతీయ 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకల్లో 19 దేశాలకు చెందిన 40 మంది ప్రతినిధులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. దీనితో పాటు జనవరి 13, 14 తేదీల్లో గచ్చిబౌలిలో అత్యాధునిక ఎల్ఈడీ డ్రోన్లతో ఆకట్టుకునే 'డ్రోన్ షో' నిర్వహిస్తామని, ఇందులో రాష్ట్ర పర్యాటక ప్రాంతాల డిజిటల్ ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది పండుగ వేడుకల్లో భాగంగా సరికొత్తగా జనవరి 16 నుంచి 18 వరకు 'హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్'ను కూడా ప్రారంభించబోతున్నామని మంత్రి జూపల్లి ప్రకటించారు. పర్యాటక రంగంలో ప్రపంచ దేశాలను ఆకర్షించడానికి మెడికల్, ఎకో మరియు టెంపుల్ టూరిజంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఉన్న చారిత్రక కట్టడాలు మరియు ప్రకృతి సంపదను పర్యాటకులకు మరింత చేరువ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, గతంలో బతుకమ్మ వేడుకల ద్వారా గిన్నిస్ బుక్ రికార్డు సాధించడాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ వినూత్న వేడుకలకు ప్రజలందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.




# ముగ్గురు మొనగాళ్లు ఉన్నా యూరియా కరువే

**ఖమ్మం (ఏడీఎన్ఎన్) :**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, రైతులకు అవసరమైన యూరియా నిల్వలను అందుబాటులో ఉంచలేకపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో బుధవారం నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , తను ఖమ్మం వచ్చే దారిలో పాలేరు నియోజకవర్గ రైతులను కలిశానని, కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని కేటీఆర్ తెలిపారు. మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. పాలిచ్చే బర్రెను వదిలేసి, తన్నే దున్నపోతును తెచ్చుకున్నట్లు అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పనులను ఇప్పుడు కాంగ్రెస్ నేతలు ప్రారంభోత్సవాలు చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ 'సీతారామ ప్రాజెక్టు'ను రూపొందించారని, అయితే ప్రస్తుత ప్రభుత్వం కమిషన్ల కోసం ఆ ప్రాజెక్టు పనులను నత్తనడకన సాగిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సర్పంచులుగా గెలవడం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే కాంగ్రెస్ నేతలు పాకులాడుతున్నారని ఆయన మండిపడ్డారు.





# కొత్త పార్టీల మనుగడ కష్టం

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీలు రావాల్సిన అవసరం లేదని, ఒకవేళ వచ్చినా వాటి మనుగడ కష్టమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో వచ్చిన అనేక పార్టీలు కాలక్రమేణా కనుమరుగయ్యాయని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్సీ కవిత కొత్త పార్టీ ప్రకటనపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కవిత స్వయంగా వచ్చి విజ్ఞప్తి చేయడం వల్లే ఆమె రాజీనామాను ఆమోదించినట్లు గుత్తా వెల్లడించారు. సాధారణంగా ఎవరైనా భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచి చూస్తామని, ఆమె విషయంలోనూ అదే అనుసరించామని స్పష్టం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన ఏ ప్రాతిపదికన చేపడతారనే అంశంపై ఇంకా స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. కేవలం జనాభా ప్రాతిపదికన విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సరికాదని హితవు పలికారు. హిల్ట్ విధానం ద్వారా పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ వల్ల అవినీతికి తావుండదని, కాలుష్య కట్టడికి ఇది దోహదపడుతుందని గుత్తా సుఖేందర్ రెడ్డి మద్దతు తెలిపారు.

# వర్శిటీ భూముల జోలికొస్తే ఊరుకోం

### కాంగ్రెస్ ప్రభుత్వానికి బండి సంజయ్ హెచ్చరిక

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కేటాయించిన భూములను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడం అత్యంత సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.యూనివర్శిటీ భూ వినియోగంపై నోటీసులు ఇవ్వడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. వేల కోట్ల విలువైన వర్శిటీ భూములను విక్రయించడానికే ప్రభుత్వం ఈ ఎత్తుగడ వేస్తోందని ఆయన ఆరోపించారు. విద్యాసంస్థలకు కనీస వసతులు కల్పించలేని ఈ ప్రభుత్వం, విద్య కోసం కేటాయించిన భూములను ప్రశ్నించడం ఏంటని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో భూ ఆక్రమణలపై ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. "పాతబస్తీలో సల్కమ్ చెరువును ఆక్రమించి, విద్యను వ్యాపారంగా మార్చిన ఓవైసీపై చర్యలు తీసుకునే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా?" అని ఆయన నిలదీశారు. అక్రమంగా ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వాడాలే తప్ప, చదువుకునే పిల్లల భూములపై పడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యాసంస్థల భూములను తాకడం అంటే అది 'రెడ్ లైన్' దాటడమేనని బండి సంజయ్ స్పష్టం చేశారు. యూనివర్శిటీ భూములను తీసుకునే నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని , లేనిపక్షంలో, విద్యార్థుల పక్షాన నిలబడి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని బండి సంజయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



# కాంగ్రెస్, బీజేపీలది 'అక్రమ బంధం'

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నప్పటికీ తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలు అక్రమ బంధాన్ని కొనసాగిస్తున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు పార్టీలు కలిసి పనిగట్టుకుని బీఆర్ఎస్ పార్టీపై, కేసీఆర్‌పై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.మహారాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వెదిరే శ్రీరామ్, సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి చాంబర్‌లో వెదిరే శ్రీరామ్‌కు ఏం పని అని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా జరిగిన ఒప్పందాలపై అవగాహన ఉన్న శ్రీరామ్.. ఇప్పుడు ఏపీకి అనుకూలంగా మాట్లాడుతున్న ఆదిత్యనాథ్ దాస్ వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. చంద్రబాబును మెప్పించడం కోసమే బీజేపీ పని చేస్తోందని, అందుకే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు రావడం లేదని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కుల కోసం కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డి 'బడే భాయ్ చోటా భాయ్' లా వ్యవహరిస్తున్నారని, బీజేపీ ప్రజాప్రతినిధులు దీనికి సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. రేవంత్, ఉత్తమ్, శ్రీరామ్ ముగ్గురు కలిసి కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.






# గ్రామీణ క్రీడా ప్రతిభకు పట్టాభిషేకం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు , గ్రామీణ స్థాయి నుంచి దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సీఎం కప్2025' రెండో ఎడిషన్ పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం జూబ్లీహిల్స్ లో ఆవిష్కరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ క్రీడల షెడ్యూల్‌ను విడుదల చేస్తూ, క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు జనవరి 8 నుంచి 17 వరకు జిల్లా కేంద్రాల్లో టార్చ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితర అధికారులు పాల్గొని, గతంలో కంటే భిన్నంగా ఈసారి నియోజకవర్గ స్థాయి పోటీలను కూడా చేర్చినట్లు వెల్లడించారు. మొత్తం 44 రకాల క్రీడల్లో ఐదు అంచెలుగా ఈ పోటీలు జరగనున్నాయి. గ్రామ స్థాయిలో జనవరి 17 నుంచి 22 వరకు, మండల స్థాయిలో జనవరి 28 నుంచి 31 వరకు, నియోజకవర్గ స్థాయిలో ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు ఈ పోటీలను నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.




# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు ఈసీ కసరత్తు

### 16న తుది ఓటర్ల జాబితా విడుదల

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణలోని మున్సిపాలిటీలు , కార్పొరేషన్ల రెండో సాధారణ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం కీలక సమావేశం నిర్వహించింది. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఈసీ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు పలు ఆదేశాలు జారీ చేసింది. జనవరి 13న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ప్రచురించి, వాటిని 'TPOLL' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించింది.జనవరి 16న ఫోటోలతో కూడిన తుది ఓటర్ల జాబితాను పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రచురించాలని స్పష్టం చేసింది.ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఈసీ సూచించింది. రిటర్నింగ్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులు , జోనల్ అధికారుల నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది. నిఘా కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ , స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను కూడా తక్షణమే ఏర్పాటు చేయాలని పేర్కొంది. పోలింగ్ సిబ్బంది నియామకం కోసం ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను వెంటనే 'TPOLL' పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని కలెక్టర్లను ఆదేశించింది.

# బ్రహ్మోస్ డీజీకి హైకోర్టులో ఊరట

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జైతీర్థ్ రాఘవేంద్ర జోషికి తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన నియామకాన్ని రద్దు చేస్తూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ ఇటీవల జారీ చేసిన ఆదేశాలపై ధర్మాసనం స్టే విధించింది. బ్రహ్మోస్ డీజీగా 2024 డిసెంబరు 1న జైతీర్థ్‌ను రక్షణ శాఖ నియమించింది . ఈ నియామకంలో నిబంధనలు పాటించలేదంటూ డీఆర్డీవో సీనియర్ సైంటిస్టు శివసుబ్రమణ్యం క్యాట్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన క్యాట్, జైతీర్థ్ నియామకాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ జైతీర్థ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు , క్యాట్ ఆదేశాల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# 'ఐబొమ్మ' రవికి షాక్

### బెయిల్ పిటిషన్లు కొట్టివేసిన నాంపల్లి కోర్టు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురయ్యింది . హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు వేర్వేరు కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రవి దాఖలు చేసిన పిటిషన్లను న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. విచారణ సందర్భంగా సైబర్ క్రైమ్ పోలీసులు కోర్టుకు కీలక సమాచారాన్ని సమర్పించారు. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని, ఈ సమయంలో బెయిల్ ఇస్తే సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రవికి విదేశాల్లో పౌరసత్వం ఉందని, ఒకసారి బెయిల్ లభిస్తే అతను దేశం దాటి పారిపోయే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పైరసీ ద్వారా రవి దాదాపు రూ. 20 కోట్ల వరకు ఆర్జించినట్లు, అతని ఖాతాల్లో రూ. 13 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.సినిమా పైరసీని ప్రోత్సహిస్తూ చిత్ర పరిశ్రమకు వేల కోట్ల నష్టాన్ని కలిగిస్తున్నాడనే ఆరోపణలపై గత నవంబర్‌లో రవిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో పక్కా ప్లాన్‌తో అతడిని అదుపులోకి తీసుకున్నారు. కాన్వాయ్‌లు, నకిలీ ఐడీలు, విదేశీ సర్వర్ల ద్వారా అతను ఈ నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్లు ఇప్పటికే విచారణలో తేలింది.

## రాశి ఫలాలు

**08-01-2026 గురువారం**

**మేషం:**
ఉద్యోగ ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఆశించిన పెళ్లి సంబంధం ఖాయమవుతుంది. ఆకస్మిక ప్రయాణాలు తప్పక పోవచ్చు. మిత్రుల వల్ల కొద్దిగా నష్టపోయే సూచనలున్నాయి. స్వల్ప అనారోగ్య అవకాశాలు న్నాయి. పిల్లల నుంచి ఆశించిన సమాచారం అందుతుంది. కుటుంబ జీవితం సాఫీగా సాగిపోతుంది. వృత్తి, వ్యాపారాలు నిలకడగా సాగిపోతాయి.

**వృషభం:**
వృత్తి జీవితం బాగా బిజీగా సాగిపోతుంది. ఆదాయానికి లోటుండదు. కుటుంబ జీవితం చాలా వరకు సానుకూలంగా, సంతోషంగా గడిచిపోతుంది. చిన్ననాటి మిత్రులతో ఎంజాయ్ చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కొందరు బంధువులతో సఖ్యత పెరుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలను కుటుంబ సభ్యుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

**మిధునం:**
ఉద్యోగంలో హోదా పెరగడానికి బాగా అవకాశం ఉంది. వృత్తి, వ్యాపారాల్లో విశ్రాంతి దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. ఇంటా బయటా ఒత్తిళ్లు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమ, తిప్పట ఎక్కువగా ఉంటాయి. ఆరోగ్యం అనుకూలంగా ఉంటుంది. ఆదాయం కూడా ఆశాజనకంగా ఉంటుంది. కొత్త ఉద్యోగ ప్రయత్నాల్లో సానుకూల స్పందన లభిస్తుంది.

**కర్కాటకం:**
వృత్తి, ఉద్యోగాల్లో ప్రాభవం, ప్రాధాన్యం బాగా పెరుగుతాయి. వ్యాపారాలు బాగా బిజీగా సాగిపోతాయి. ఇంటా బయటా మీ మాటకు విలువ ఉంటుంది. ఒకటి రెండు శుభవార్తలు వింటారు. నిరుద్యోగులు ఆశించిన సమాచారం అందుకుంటారు. పెళ్లి ప్రయత్నాలు సఫలం అవుతాయి. రుణ భారం తగ్గించుకునే ప్రయత్నం చేస్తారు.

**సింహం:**
వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటా బయటా అనుకూలతలు పెరుగుతాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. ఆదాయానికి ఇబ్బందేమీ ఉండదు. ఇతరులకు సహాయం చేసే స్థితిలో ఉంటారు. జీవిత భాగస్వామితో కలిసి వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. పిల్లలు వృద్ధిలోకి వస్తారు. ఆస్తి వివాదం కొలిక్కి వస్తుంది. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాల్లో శుభవార్తలు వింటారు.

**కన్య:**
వృత్తి, ఉద్యోగాల్లో మీ సలహాలు, సూచనలకు విలువ పెరుగుతుంది. వ్యాపారాలు పురోగతి చెందు తాయి. ఒకటి రెండు ఆర్థిక, వ్యక్తిగత సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తవుతాయి. కొత్త ఉద్యోగాలు, కొత్త ఆదాయ మార్గాల గురించి చేసే ప్రయత్నాలు సానుకూలపడతాయి. ఆధ్యాత్మిక విషయాల మీద ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాల్లో శుభవార్తలు వింటారు.

**తుల:**
ముఖ్యమైన పనులను తేలికగా పూర్తి చేస్తారు. ఇతరులకు మేలు జరిగే పనులు చేస్తారు. ఆదాయం బాగానే ఉంటుంది. అదనపు ఆదాయ మార్గాలు సఫలం అవుతాయి. దైవ కార్యాల్లో పాల్గొంటారు. కుటుంబంతో ఇష్టమైన ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, ఉద్యోగాల్లో ప్రత్యేక బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తుంది. వ్యాపారాలు బాగా బిజీగా సాగిపో తాయి.

**వృశ్చికం:**
పని ఒత్తిడి కాస్తంత ఎక్కువగా ఉంటుంది. వ్యాపారాల్లో కూడా ఎక్కువగా శ్రమపడాల్సి వస్తుంది. ఏ పని తలపెట్టినా ఒత్తిడి, శ్రమ తప్పకపోవచ్చు. ఒకరిద్దరు మిత్రుల్ని ఆర్థికంగా ఆదుకుంటారు. ఆదాయానికి లోటుండదు కానీ, వృథా ఖర్చుల్ని వీలైనంతగా తగ్గించుకోవడం మంచిది. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యక్తిగత సమస్య పరిష్కారం అవుతుంది.

**ధనస్సు:**
ఆదాయానికి సంబంధించి కొత్త మార్గాలు మీ ముందుకు వస్తాయి. రాజకీయ ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయి. వ్యాపారాల మీద శ్రద్ధ పెరుగుతుంది. ఇతరులకు ధనపరంగా వాగ్దానాలు చేయకపోవడం మంచిది. లేనిపోని బాధ్యతలను నెత్తికెత్తుకోవడం జరుగుతుంది.

**మకరం:**
ఆదాయ వృద్ధి ప్రయత్నాలకు సమయం బాగా అనుకూలంగా ఉంటుంది. ఏ ప్రయత్నం చేపట్టినా విజయవంతం అవుతుంది. గతంలో తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనివ్వడం ప్రారంభిస్తాయి. ఆదాయం మెరుగ్గా ఉంటుంది. వ్యాపారంలో పెట్టుబడులు పెంచడానికి, వ్యాపారాలు విస్తరించడానికి అవకాశం ఉంది. ముఖ్యమైన వ్యవహారాలను తేలికగా పూర్తి చేస్తారు.

**కుంభం:**
లక్ష్యాలు, బాధ్యతల విషయంలో ఉద్యోగంలో అధికా రుల నుంచి ఒత్తిడి ఉంటుంది. వ్యయ ప్రయాసలున్నప్పటికీ, కొన్ని ముఖ్యమైన వ్యవహారాలను, పెండింగు పనులను సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. మీ నుంచి సహాయం పొందినవారు ముఖం చాటేస్తారు. కుటుంబ వ్యవహారాల్లో జీవిత భాగస్వామిని సంప్రదించడం మంచిది. ఆదాయం బాగానే ఉంటుంది. ఆరోగ్యం అనుకూలంగా ఉంటుంది.

**మీనం:**
వృత్తి, ఉద్యోగాల్లో హోదా, జీతభత్యాలు పెరిగే అవకాశం ఉంది. వ్యాపారాలు లాభసాటిగా పురోగమిస్తాయి. ఏ పని తలపెట్టినా సునాయాసంగా పూర్తవుతుంది. మిత్రుల నుంచి సహాయ సహకారాలు లభిస్తాయి. కుటుంబసమేతంగా దైవ కార్యాల్లో పాల్గొంటారు. పిల్లల నుంచి శుభవార్తలు వింటారు. అనుకోకుండా ఇష్టమైన బంధువుల్ని కలుసుకుంటారు. మంచి పరిచయాలు ఏర్పడతాయి.

## నేనే జూరాల నీళ్లిచ్చా!

**మొదటిపేజీ తరువాయి....**

ఇందులో ఇప్పటికే 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు ఎత్తు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తి లేదని, పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అలాగే నిర్వాసితుల పునరావాసం పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. పోలవరం కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే కాదని, ఇది దేశానికే గర్వకారణమని పేర్కొన్న ఆయన, ఈ ప్రాజెక్టు పూర్తయితే తెలుగు రాష్ట్రాల మధ్య జల జగడాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మొదటి సారిగా తెలుగులో ఛార్జ్ షీట్..



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**
సాధారణంగా ఛార్జ్ షీట్‌ను ఇంగ్లీష్‌లో దాఖలు చేస్తుంటారు. కానీ ఓ మహిళా కానిస్టేబుల్ తెలుగులో అభియోగపత్రం దాఖలు చేసి కొత్త విధానానికి నాంది పలికారు. ఏదైనా కేసుకు సంబంధించిన విషయాలు ఇంగ్లీషులో ఉండటంతో చదివేందుకు, అర్థం చేసుకోవడానికి సామాన్యులకు చాలా ఇబ్బంది కలుగుతూ ఉంటుంది. న్యాయవ్యవస్థలోని పలు విషయాలు తెలుగులో సామాన్యులకు అర్థమయ్యేలా మరింతగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సైబరాబాద్ కమిషనరేట్‌లోని దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒక మహిళా హెడ్ కానిస్టేబుల్ పూర్తిగా తెలుగు భాషలోనే ఛార్జ్ షీట్లు దాఖలు చేయడం ద్వారా ప్రశంసలు అందుకున్నారు. సాధారణంగా అధికారిక విధానాలలో ఇంగ్లీష్ ఆధిపత్యం కొనసాగుతుంది. పోలీసుల ఛార్జ్ షీట్లు, ప్రభుత్వ జీఓల్లో మొత్తం ఇంగ్లీషే వాడుతున్నారు. అయితే దుండిగల్ హెడ్ కానిస్టేబుల్ స్వరూప, 2025లో రెండు కేసులలో దర్యాప్తు పూర్తిచేసి అన్ని విషయాలను తుది నివేదికలో తెలుగులో కోర్టుకు సమర్పించారు. దీనివలన ఫిర్యాదుదారులు, స్థానికులు కేసుకు సంబంధించిన విషయాలపై మెరుగైన అవగాహన ఏర్పడింది. బౌరంపేటలోని ఒక కిరాణా దుకాణంలో వ్యక్తి మద్యం అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడిపై కేసును ఎక్సైజ్ చట్టం ప్రకారం దర్యాప్తు పూర్తిచేసి.. అభియోగపత్రాన్ని తెలుగులోనే మేడ్చల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్‌కు సమర్పించారు. మరో కేసులో తప్పిపోయిన 35 ఏళ్ల మహిళ, ఆమె కుమార్తెను కనుగొని వారిని సురక్షితంగా వారి కుటుంబంతో తిరిగి కలిపారు. దర్యాప్తు తుది నివేదికను తెలుగులోనే కోర్టులో సమర్పించారు. సీనియర్ అధికారులు హెడ్ కానిస్టేబుల్ చొరవకు మద్దతు ఇచ్చారు. ప్రాంతీయ భాషలను ఉపయోగించడం వల్ల చట్టం గురించి జనాల్లో మరింత అవగాహన వస్తుందని పేర్కొన్నారు. స్వరూప ప్రయత్నాలకు ఉన్నతాధికారుల నుండి ప్రశంసలు లభించాయి. తరువాత హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీసు కార్యక్రమంలో ఆమె సైబర్ వారియర్స్ లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఏసీపీ శంకర్ రెడ్డి సహకారంతో మేడ్చల్ కోర్టులో ఈ తెలుగు అభియోగపత్రాలను దాఖలు చేశారు. తెలుగు భాషలో దర్యాప్తు తర్వాత పూర్తి నివేదికను దాఖలు చేసినందుకు గాను ఇటీవల బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, శిఖా గోయల్ ఐపీఎస్ చేతుల మీదుగా హెడ్ కానిస్టేబుల్ స్వరూప ప్రశంసలు అందుకున్నారు.


## కొండగట్టు ఆలయంపై టీటీడీ ఛైర్మన్ ఆదేశాలు

**తిరుపతి అన్నమయ్య (ఏడీఎన్ఎన్):**
తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులు వేగంగా పూర్తిచేయాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం నాడు ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించి ఏదైనా పాలనాపరమైన సమస్యలు తలెత్తితే పాలకమండలి దృష్టికి తేవాలన్నారు. టీటీడీలో జరుగుతున్న పలు ఇంజినీరింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులకు సూచించారు. టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌తో కలసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. అమరావతి వేంకటపాలెంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఎస్వీ ఆలయ విస్తరణ పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా టీటీడీ కల్యాణ మండపాలపై ఒక కమిటీని ఏర్పాటు చేసి వారు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టాలని సూచించారు. 5 వేల భజన మందిరాలను, నిర్మాణంలో ఉన్న ఆలయాలను, ఇటీవల కాలంలో అనుమతులు పొందిన ఆలయాలను సకాలంలో



పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపమాకలోని ఎస్వీ ఆలయం, కరీంనగర్‌లోని శ్రీ పద్మావతీ ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, అనంతవరం ఎస్వీ ఆలయం, కుప్పంలో నిర్మించనున్న ఆలయాలు, నవీ ముంబైలోని ఎస్వీ ఆలయం, ముంబైలోని భాంద్రా, కర్నాటకలోని బెల్గావిలోని ఎస్వీ ఆలయం, కొండగట్టు అంజన్న ఆలయం పరిధిలో అభివృద్ధి పనులు, కాణిపాకంలోని పీఏసీ తదితర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు బీఆర్ నాయుడు. అదేవిధంగా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం సమీపంలో పలు అభివృద్ధి పనులు, 108 అడుగుల జాంబవంతుడు విగ్రహ ఏర్పాటు తదితర పనులతో పాటు టీటీడీలో జరుగుతున్న పనులను సకాలంలో, జరుగనున్న పనులకు పాలనాపరమైన అనుమతులు తీసుకుని పూర్తి చేయాలన్నారు. అలిపిరిలో భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న బేస్ క్యాంప్‌నకు డిజైన్‌లను తయారు చేయాలన్నారు. అదేవిధంగా తిరుమల, తిరుపతిలో నిర్మాణంలో ఉన్న ఇంజినీరింగ్ పనులను గడువులోపు పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే వేసవి సమయానికి భక్తులకు ఇబ్బంది లేకుండా వసతి సౌకర్యాలు, క్యూలైన్లు, రహదారులు, తాగునీరు తదితర సౌకర్యాలపై ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సూచించారు. నిర్మాణాలకు సంబంధించి ఏదైనా పాలనాపరమైన సమస్యలు తలెత్తితే పాలకమండలి దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, ఎం. శాంతారామ్. పనబాక లక్ష్మి, ఎస్.నరేష్ కుమార్ హాజరయ్యారు. నన్నపనేని సదాశివరావు వర్చువల్ ద్వారా, జేఈవో వి. వీరబ్రహ్మం, ఎఫ్ఎ అండ్ ఎస్ఏవో ఓ బాలాజీ, సీఈ టివి సత్యనారాయణ, ఎస్.ఈ శ్రీ మనోహరం, పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం..



**చెన్నై (ఏడీఎన్ఎన్):**
బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో ఈ నెల 9వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెన్నై ప్రాంతీయ వాతావరణ శాఖ కేంద్రం వెల్లడించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఇపుడు తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది క్రమంగా మరింతగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ కారణంగా రానున్న రెండు రోజుల పాటు కోస్తా తీరప్రాంత జిల్లాల్లో కొన్ని చోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ నెల 9వ తేదీ వరకు తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై, రామనాథపురం, పుదుక్కోటతో పాటు డెల్టా జిల్లాల్లో భారీ వర్షం కురుస్తుందని పేర్కొంది. ఈ వాయుగుండం కారణంగా గల్ఫ్ ఆఫ్ మన్నార్, కన్యాకుమారి కోస్తా తీరంలో గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రాజధాని చెన్నై నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.



## ఇంటర్ బాలికపై లైంగిక దాడి

**శ్రీకాకుళం (ఏడీఎన్ఎన్):**
శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఓ యువకుడు ఇంటర్ చదువుతున్న దళిత బాలికపై లైంగికదాడి చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మంగువారితోట కంద్రవీధికి చెందిన బొమ్మలాట నవీన్ (19) నెల రోజులుగా బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లి దండ్రులకు చెప్పడంతో వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ యువకుడిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. కేసును జిల్లా పోలీస్ శిక్షణా సంస్థ డీఎస్పీ గోవిందరావు దర్యాప్తు చేస్తున్నారు.


## విమానంలో కిలో గంజాయి.. కలకలం..

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**
హైదరాబాద్‌లోని శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మరోసారి గంజాయి కలకలం రేపింది. ఎయిరిండియా విమానంలో గంజాయి పట్టుబడింది. విదేశాల్లో సాగుచేస్తున్న హైడ్రోఫోనిక్ గంజాయి దాదాపు కిలోవరకు దొరికింది. పట్టుబడిన గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకు




న్నారు. తనిఖీలకు భయపడిన నిందితులు విమానంలోనే ఈ గంజాయిని వదిలివెళ్లినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నిందితుల కోసం అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఇటీవల విదేశాల్లో సాగుచేస్తున్న హైడ్రోఫోనిక్ (మట్టి లేకుండా సాగుచేసే) గంజాయిని ఇండియాకు తరలించడం ఇటీవల పెరిగింది. ఈ తరహాలో విదేశాల నుంచి గంజాయిని తీసుకొస్తున్న వారిపై డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు నిఘా పెంచారు.

## కెపిహెచ్‌బి ఆలయంలో దొంగలు పడ్డారు..



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**
హైదరాబాద్ - కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో సర్దార్ పటేల్ నగర్ లోని గుడిలో చోరీ జరిగింది. వేంకటేశ్వరస్వామి గుడిలో గర్భగుడి తాళాలు పగులగొట్టి విగ్రహానికి ఉన్న నగలు అపహరించారు. సుమారు రూ.30 లక్షల విలువ చేసే 15 తులాల వెండి ఆభరణాలతో పాటు 3 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుడిలోకి ప్రవేశించి చోరీ చేసినట్లు గుర్తించారు. తెల్లవారు జామున రోజూ మాదిరిగానే గుడిని తెరిచి పూజలు నిర్వహించే క్రమంలో పూజారులు గుర్తించారు. వెంటనే గుడి నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## కాంగ్రెస్ బాకీ కార్డును ఆవిష్కరించిన మాజీ మంత్రి..

**మహబూబ్‌నగర్ (ఏడీఎన్ఎన్):**
మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ 'బాకీ కార్డుల'ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా విఫలమైందని ఆరోపించారు. మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, విద్యార్థులకు స్కూటీలు, రైతులకు రైతు భరోసా సహాయం, రుణమాఫీ చేయకుండా ప్రజలకు బాకీ పడిందన్నారు. ఇచ్చినమాట తప్పిన కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. ఈ బాకీలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని కొట్టి చంపిన మైనర్లు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**
ఢిల్లీలో మరో దారుణ సంఘటన జరిగింది. 11వ తరగతి చదువుతున్న 17 ఏళ్ల విద్యార్థిని కొందరు స్థానిక మైనర్లు కొట్టి చంపారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో జరిగింది. మృతుడిని ఢిల్లీలోని త్రిలోకపురి, ఇంద్రా క్యాంప్ ప్రాంతానికి చెందిన మోహిత్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోహిత్‌కు కొంతకాలం నుంచి అదే ప్రాంతానికి చెందిన మరో మైనర్ యువకుడితో గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం సాయంత్రం మోహిత్ తన స్నేహితులతో కలిసి ఉండగా, ప్రత్యర్థి యువకుడికి, అతడి స్నేహితులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇది వారి మధ్య ఘర్షణకు దారితీసింది. నిందితుడు, అతడి స్నేహితులు మోహిత్‌ను చుట్టుముట్టి, దాడి చేశారు. దారుణంగా కొట్టారు. వెంటనే మోహిత్ కిందపడిపోయాడు. అయినప్పటికీ అతడిపై దాడి చేస్తూనే ఉన్నారు. స్థానికంగా కొందరు అడ్డుకోవడానికి ప్రయత్నించగా.. వారిపై కూడా నిందితులు దాడి చేశారు. ఈ ఘటనలో మోహిత్ అక్కడికక్కడే స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే మోహిత్‌ను అతడి స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎల్‌బిఎస్ ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గురు తేజ్ బహదూర్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే, తీవ్ర గాయాలైన మోహిత్ అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మరణించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన ఆరుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.




**సవరించిన ధరలతో ప్రయాణికులకు ఆర్టీసీ షాక్**

## సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు


**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**
సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా 6,431 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు సంస్థ బుధవారం ప్రకటించింది. ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో గమ్యస్థానాలకు చేరవేసేందుకు, అలాగే పండుగ ముగిసిన తర్వాత తిరిగి వచ్చే వారి కోసం 18, 19 తేదీల్లో ఈ బస్సులను అందుబాటులో ఉంచనున్నారు.

ప్రత్యేక బస్సుల నిర్వహణ ఖర్చుల దృష్ట్యా టికెట్ ధరలను పెంచుతున్నట్లు ఆర్టీసీ వెల్లడించింది. ప్రభుత్వ జీవో ప్రకారం సాధారణ ధరల కంటే 1.5 రెట్లు వరకు ధరలను సవరించినట్లు స్పష్టం చేసింది. ఇది ప్రయాణికులపై అదనపు భారంగా మారనుంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, మియాపూర్ వంటి ప్రధాన ప్రాంతాల నుంచి ఈ బస్సులు బయలుదేరుతాయి. ధరలు పెరిగినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా మహిళలకు పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం యధావిధిగా కొనసాగుతుందని సంస్థ స్పష్టం చేసింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.



## టన్ను అరటికి రూ.21 వేలు..

**అనంతపురం (ఏడీఎన్ఎన్):**
ఈ ఏడాది అరటి పంట సాగు చేస్తున్న రైతులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. వారికి సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్లైంది. అరటికి తగిన గిట్టుబాటు ధర లభిస్తుండడంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. టన్ను అరటికి ధర రూ.21 వేలు పలుకుతోంది. అరటి రైతుల మొహంపై 'ధర'హాసం కనిపిస్తోంది. పాతాళానికి పడిపోయిన ధర ఇటీవల మళ్లీ పెరిగింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొదటి పంట టన్ను రూ.21 వేలు పలుకుతోంది. మండలంలో అరటి మొదటి పంటను 1200 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో ఎక్కువ శాతం జనవరి నెలాఖరు, ఫిబ్రవరి నెలల్లో దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అప్పటికి అరటి ధరలు ఇంకాస్త పెరగవచ్చనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



## సుమిత్ర లేడీ కాదు.. మాయ లేడీ..

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**
సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి కర్మన్‌ఘాట్‌లో ఒంటరిగా నివసిస్తున్న సుగుణ (68) పై స్ప్రేతో దాడిచేసి సుమారు 10 తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. వృద్ధురాలికి పరిచయస్తురాలైన సుమిత్ర అనే మహిళ మరో ఇద్దరితో కలిసి ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంటికి వెళ్లింది. ముఖంపై స్ప్రేతో దాడిచేసి అపస్మారక స్థితిలోకి చేరిన తర్వాత ఆమె ఒంటిపై ఉన్న పది తులాల బంగారంతో ఉడాయించారు. వృద్ధురాలు ఫిర్యాదు మేరకు సుమిత్రను అదుపులోకి తీసుకున్న సరూర్‌నగర్ పోలీసులు మిగతా ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని ఎల్‌బినగర్ ఏసీపీ కిష్టయ్య, సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి పరిశీలించారు.



## టెండూల్కర్ ఇంట్లో పెళ్లి బాజాలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఇంట్లో త్వరలో పెళ్లి బాజాలు మ్రోగనున్నాయి. ఆయన కుమారుడు అర్జున్ టెండూల్కర్, ముంబై వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు సానియా చందోక్ వివాహం 2026 మార్చిలో జరగవచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. పెళ్లి వేడుకలు మార్చి 3న ప్రారంభమై, మార్చి 5న వివాహం జరగుతుందని, ఈ వేడుకలకు కేవలం కుటుంబ సభ్యులు, స్నేహితులు మాత్రమే హాజరుకానున్నారని తెలుస్తోంది. 2025 ఆగస్టులో అర్జున్, సానియా నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. అర్జున్ టెండూల్కర్ ప్రస్తుతం ఐపీఎల్‌లో లక్నో సూపర్ జాయింట్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. లెఫ్ట్‌ఆర్మ్ ఫాస్ట్ బౌలర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్‌గా క్రికెట్ కెరీర్‌లో అడుగు పెట్టిన అతను 2022లో గోవా తరఫున రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసి సెంచరీ సాధించాడు. ఇక సానియా చందోక్ కుటుంబం హాస్పిటాలిటీ, ఆహార రంగాల్లో విస్తృత వ్యాపారాలను నిర్వహిస్తోంది. ఇంటర్ కాంటినెంటల్ హోటల్, బ్రూక్లిన్ క్రీమరీ, మెరైన్ డ్రైవ్ వంటి సంస్థలు రవి ఘాయ్ నేతృత్వంలో నడుస్తున్నాయి.




## ఎస్బీఐ యోనో యాప్ పేరుతో సరికొత్త మోసం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసానికి పాల్పడుతున్నారు. వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రస్తుతం ఒక ప్రమాదకరమైన సందేశం వైరల్ అవుతోంది. ఈ మెసేజ్ లో వినియోగదారులను ఆందోళనలో పడేస్తూ, "మీ ఆధార్ వివరాలను వెంటనే అప్‌డేట్ చేయకపోతే యోనో యాప్ పనిచేయడం నిలిచిపోతుంది" అని హెచ్చరిస్తోంది. మోసగాళ్లు వినియోగదారులకు ఒక ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేసి ఇన్ స్టాల్ చేసుకోవాలని సూచిస్తున్నారు. దీన్ని ఇన్‌స్టాల్ చేస్తే, వ్యక్తిగత బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్, ఓటీపీలు వంటి సున్నితమైన సమాచారాన్ని చోరీ చేయడానికి వీలవుతుంది. ఈ వార్తపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారిక ధృవీకరణ కోరినపుడు, భారత ప్రభుత్వం సంబంధిత అధికారిక సంస్థ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ బ్యూరో రంగంలోకి దిగింది. "ఎస్బీఐ ఖాతాదారులకు ఇది పూర్తి స్థాయిలో నకిలీ సమాచారం. ఎలాంటి ఆధార్ అప్‌డేట్ లేదా ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ అవసరం లేదు. వినియోగదారులు ఏకాగ్రత, జాగ్రత్తతో ఉండాలి" అని హెచ్చరించింది. నిపుణుల సూచన ప్రకారం, ఏదైనా సందేహాస్పద లింక్, మెసేజ్ లేదా ఫైల్‌ను డౌన్ లోడ్ చేయడం, వ్యక్తిగత వివరాలను ఇన్ పుట్ చేయడం తప్పించుకోవాలి. అధికారిక యాప్‌లు, వెబ్‌సైట్లు ద్వారా మాత్రమే లావాదేవీలను నిర్వర్తించాలి. అంతేకాక, యోనో యాప్ లేదా ఇతర బ్యాంక్ సర్వీసులు నిలిచిపోయినట్లు లేదా అకౌంట్లో సమస్యలు ఉన్నట్లు ఏదైనా సందేశం వచ్చినప్పుడు, వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదించి, అనుమానాలు నివృత్తి చేసుకోవాలి.



## వరుస నష్టాల్లో స్టాక్ మార్కెట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84,620.40 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమై, రోజంతా ఒడిదుడుకుల మధ్య క్షీణతలోనే కొనసాగింది. చివరికి 102.20 పాయింట్లు కోల్పోయి 84,961.14 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 37.95 పాయింట్ల నష్టంతో 26,140.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.87గా నమోదైంది. రంగాల వారీగా ఆటోమొబైల్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మరోవైపు కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ రంగ షేర్లు లాభాలతో నిలిచాయి. సెన్సెక్స్ 30 షేర్లలో మారుతీ సుజుకీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా లాభాల జాబితాలో నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బ్రెంట్ క్రూడ్ చమురు బ్యారెల్ ధర 60.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్సు ధర 4,464.01 డాలర్లకు చేరుకుంది. ప్రపంచ మార్కెట్ల నుంచి వచ్చే సంకేతాలు, రానున్న త్రైమాసిక ఫలితాలపై అంచనాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లలో సమీప కాలంలోనూ ఒడిదుడుకులు కొనసాగవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ లపై చేసిన హెచ్చరికలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీనితో పాటు విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు దిగడం, త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల సూచీలు పతనమయ్యాయని భావిస్తున్నారు.

## వేదికలు మార్చలేం : తేల్చేసిన ఐసీసీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




భారత్ లో ఆడాల్సిన తమ మ్యాచ్ లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించింది. ఇప్పటికే హోటల్ బుకింగ్స్, బ్రాడ్ కాస్టింగ్ షెడ్యూల్స్ సహా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈ దశలో మార్పులు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. అధికారికంగా తుది నిర్ణయం జనవరి 10న వెలువడాల్సి ఉన్నప్పటికీ, వేదికలు మారే అవకాశం దాదాపు లేకుండా పోయింది. దీంతో షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ తన గ్రూప్ స్టేజ్ మ్యాచ్ లను భారత్ లోనే ఆడాల్సి ఉంటుంది. భారత్, శ్రీలంకలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న టీ20 ప్రపంచకప్ నిర్వహణకు సంబంధించి ఇది కీలక పరిణామంగా మారింది. భద్రతా కారణాలు, రాజకీయ పరిస్థితులను ప్రస్తావిస్తూ వేదికల మార్పు కోరిన బీసీబీ అభ్యర్థనను ఐసీసీ అంగీకరించలేదు. టీ20 వరల్డ్ కప్ 2026 కోసం భారత్‌లో అహ్మదాబాద్, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, ముంబైలను వేదికలుగా ఎంపిక చేశారు. బంగ్లాదేశ్ జట్టు గ్రూప్-సిలో ఉంది. ఈ గ్రూప్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్, నేపాల్, ఇటలీ జట్లు ఉన్నాయి. బంగ్లాదేశ్ తన నాలుగు గ్రూప్ స్టేజ్ మ్యాచ్ లలో మూడు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో, చివరి మ్యాచ్ ముంబై వాంఖడే స్టేడియంలో ఆడనుంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. ఒక్క జట్టు కోసం షెడ్యూల్ మారిస్తే ఇతర జట్ల ప్రయాణ ప్రణాళికలు, సాధన షెడ్యూల్స్ దెబ్బతింటాయని ఐసీసీ అభిప్రాయపడింది. అలాగే ఐసీసీ నిబంధనల ప్రకారం గ్రూప్-బి మ్యాచ్‌లు ఇప్పటికే శ్రీలంకలో జరగనున్నాయి. పాకిస్థాన్ తన అన్ని మ్యాచ్ లను అక్కడే ఆడనుండగా, బంగ్లాదేశ్ కూడా అక్కడికి మారితే వేదికలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతుందని ఐసీసీ పేర్కొంది.

## స్వచ్ఛందంగానే తప్పుకున్నా: రిధిమా పాఠక్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ హోస్టింగ్ ప్యానల్‌లో భారత్‌కు చెందిన రిధిమా పాఠక్ ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తున్నారు. భారత్-బంగ్లాదేశ్ మధ్య దౌత్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆమె వైదొలిగారు. కొన్ని మీడియా వార్తల్లో ఆమెను బీపీఎల్ నుంచి తొలగించారని ప్రచారం అయినప్పటికీ, ఆమె దీనిని ఖండించారు. తాను స్వచ్ఛందంగానే బీపీఎల్ నుండి తప్పుకున్నానని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా పోస్ట్ ద్వారా వెల్లడించారు. "బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ నుంచి నన్ను తొలగించారు అనే వార్తలు నిజం కాదు. నేను వ్యక్తిగత నిర్ణయంగా వైదొలగాలని నిర్ణయించుకున్నాను. నా దేశమే నాకు ముఖ్యం. నిజాయతీ, గౌరవంతో క్రికెట్ సేవలో గడిపిన అవకాశాన్ని కొనసాగిస్తాను. నాకు మద్దతుగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. వరుసగా హిందువులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఐపీఎల్ నుండి బంగ్లా ఆటగాడు ముస్తాఫిజుర్ రహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి రిలీజ్ చేసిన వివాదం నేపథ్యంలో రిధిమాను కూడా తొలగించారన్న వార్తల నేపథ్యంలో ఆమె స్పందించారు. భారత్ బంగ్లాదేశ్ మధ్య కొనసాగుతున్న ఈ వివాదం, కేవలం క్రికెట్‌కే కాకుండా ఇతర క్రీడా రంగాలపైనా ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సెంచరీతో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



మూడు యూత్ వన్డే సిరీస్ కోసం దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత అండర్ 19 జట్టు అదరగొడుతోంది. కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ సెంచరీతో చెలరేగిపోయాడు. ఈ సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్ లను గెలిచిన టీమిండియా ఇప్పటికే 20తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో భారత్ బ్యాటింగ్ లో దూసుకెళ్తోంది. టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన యువ భారత జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 393 పరుగులు చేసింది. ఆయుష్ మాత్రే గైర్హాజరీలో తొలిసారిగా సారథ్య బాధ్యతలు అందుకున్న వైభవ్ సూర్యవంశీ 74 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్స్‌లతో 127 రన్స్ చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ కూడా శతక్కొట్టాడు. 106 బంతుల్లో 16 ఫోర్లు కొట్టి 118 పరుగులు సాధించి జట్టుకు శక్తివంతమైన ఆధారం ఇచ్చాడు. వేదాంత్ త్రివేది 43 బంతుల్లో 34, మహ్మద్ ఎషాన్ 28 నాటౌట్, హెనిల్ పటేల్ 19నాటౌట్, అభిజ్ఞాన్ కుందు 21 పరుగులు చేశారు. ముఖ్యంగా వైభవ్, ఆరోన్ జోడీ తొలి వికెట్‌కు 227 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించింది. దీనితో వైభవ్ సూర్యవంశీ ప్రత్యేక ఘనత సాధించాడు. 14 ఏళ్ల చిన్న వయసులోనే యూత్ వన్డే క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్నవయస్కుడైన అండర్19 కెప్టెన్ గా రికార్డు సృష్టించాడు.



## భారీగా పెరిగిన ఆస్ట్రేలియా ఓపెన్ ప్రైజ్‌మనీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీకి ప్రైజ్ మనీ భారీగా పెరిగింది. సుమారుగా 111.5 మిలియన్ ఆసీస్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.675 కోట్లుగా ప్రకటించారు. ఇది గత సంవత్సరం 96.5 మిలియన్ ఆసీస్ డాలర్ల (రూ.584 కోట్లు)తో పోలిస్తే 16 శాతం పెరుగుదల. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 4.15 మిలియన్ ఆసీస్ డాలర్లు (సుమారు రూ.25.15 కోట్లు) ఇవ్వబడతాయి. సింగిల్స్ విజేతల ప్రైజ్ మనీ 19శాతం పెరిగింది, అలాగే మెయిన్ డ్రా సింగిల్స్, డబుల్స్ ఆటగాళ్లకు కూడా 10శాతం పెంచారు. ఈ నెల 18 నుంచి మెల్‌బోర్న్ లో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ ప్రారంభమవుతుంది.

## శాలరీ అకౌంట్ ఉంటే సూపర్ బెనిఫిట్స్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

శాలరీ అకౌంట్ సాధారణ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ లాంటిది కాదు. దీనితో ఎన్నో లాభాలున్నాయని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఈ విషయాలు బ్యాంకు వాళ్లు ఖాతాదారులకు చెప్పకపోవచ్చు. కానీ ఈ సూపర్ బెనిఫిట్స్ తెలుసుకుంటే చాలా ఉపయోగంగా ఉంటుంది.



- ❖ శాలరీ అకౌంట్‌లో కనీస బ్యాలెన్స్ నిర్వహించాల్సిన అవసరం లేదు. ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉన్నప్పటికీ, బ్యాంకు ఎటువంటి పెనాల్టీ విధించదు, ఈ సౌకర్యం సాధారణ సేవింగ్స్ ఖాతాలో లభించదు.
- ❖ శాలరీ అకౌంట్‌తోపాటు ఉచిత డెబిట్ కార్డ్, చెక్ బుక్ అందిస్తాయి. దీనికి ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయబోరు, అయితే సాధారణ ఖాతాలో దీనికి ఛార్జీలు ఉండవచ్చు.
- ❖ నెఫ్ట్, ఆర్టీజీఎస్ వంటి ఆన్‌లైన్ సేవలు శాలరీ అకౌంట్‌లో ఈజీగా, ఉచితంగా చేసుకోవచ్చు. ఎలాంటి ఛార్జీలు ఉండవు.
- ❖ అనేక శాలరీ అకౌంట్‌లలో ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం ఉంటుంది. అంటే ఖాతాలో బ్యాలెన్స్ అయిపోయినా, మీరు కొంత పరిమితి వరకు డబ్బును విత్‌డ్రా చేయవచ్చు.
- ❖ వ్యక్తిగత రుణం, గృహ రుణం లేదా కారు రుణం పొందడం సులభం అవుతుంది. బ్యాంకులు జీతం ఉన్న ఖాతాదారులను ఎక్కువగా విశ్వసిస్తాయి.
- ❖ శాలరీ అకౌంట్ దారులకు ప్రత్యేక కౌంటర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్, వేగవంతమైన సేవ వంటి సౌకర్యాలు ఉండవచ్చు.
- ❖ శాలరీ ఖాతాదారులకు ఆన్‌లైన్ షాపింగ్, ఫుడ్ యాప్‌లు రెస్టారెంట్లలో ప్రత్యేక డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు లభిస్తాయి, దీనితో రోజువారీ ఖర్చు తగ్గవచ్చు.

## లక్ష మైలురాయి దాటిన టాటా నెక్సాన్ ఈవీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్ విద్యుత్ వాహనాల విభాగంలో కీలక మైలురాయిని సాధించింది. టాటా నెక్సాన్ ఈవీ లక్ష విక్రయాలను దాటిన తొలి భారతీయ ఎలక్ట్రిక్ కారుగా నిలిచింది. మొత్తంగా కంపెనీలోని విద్యుత్ కార్ల మోడల్స్ లో ఇప్పటివరకు 2.50 లక్షల ఈవీలను విక్రయించగా.. వాటిలో నెక్సాన్ మాత్రమే లక్ష దాటింది. ప్రస్తుతం దేశీయ ఈవీ మార్కెట్లో 66 శాతం వాటాతో టాటా మోటార్స్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం టాటా మోటార్స్ టియాగో ఈవీ, పంచ్ ఈవీ, నెక్సాన్ ఈవీ, కర్వ్ ఈవీ, హ్యారియర్ ఈవీలతో పాటు ఫ్లీట్ విభాగంలో ఈవీలను విక్రయిస్తోంది. ఇందులో నెక్సాన్ ఈవీ ప్రధానంగా అమ్మకాలను ముందుండి నడిపిస్తోంది. టాటా విక్రయించే ప్రతి 10 కార్లలో నాలుగు నెక్సాన్ ఈవీలే కావడం విశేషం. రాబోయే ఐదేళ్లలో ఐదు కొత్త విద్యుత్ మోడళ్లను ప్రవేశపెట్టనున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. ఈ లక్ష్యంతో 2030 నాటికి రూ.16 నుంచి రూ.18 వేల కోట్ల పెట్టుబడిని వినియోగించనుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 10 లక్షల ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది సియారా ఈవీ, కొత్త పంచ్ ఈవీ లాంచ్ చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు. అలాగే మూడేళ్లలో ప్రీమియం మోడల్ అవిన్యాను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వినియోగదారులకు ఈవీలను అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని, పోటీ మార్కెట్లో 50 శాతం వాటా సాధించాలని టాటా మోటార్స్ ఆశాభావం వ్యక్తం చేసింది.

## వెండికి కూడా హాల్‌మార్కింగ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



బంగారంతో పాటు వెండి ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకోబోతోంది. వెండి వస్తువులకు కూడా ఇకపై హాల్ మార్కింగ్ తప్పనిసరి చేయాలనే యోచనపై కేంద్రం పరిశీలన జరుపుతోంది. భారతీయ ప్రమాణాల మండలి డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ ఈ విషయాన్ని వెల్లడించారు. "వెండికి కూడా తప్పనిసరిగా హాల్‌మార్కింగ్ ఉండాలని పరిశ్రమ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా నిబంధనలు తీసుకురావడానికి ముందు అవసరమైన వనరుల గురించి అంచనా వేస్తున్నాం" అని గార్గ్ పేర్కొన్నారు. ప్రస్తుతం వెండి వస్తువులకు హాల్‌మార్కింగ్ అవసరం లేదు, అయితే పరిశ్రమ వర్గాలు దీన్ని తప్పనిసరిగా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం వెండి వస్తువులపై యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఉంటుంది. దీనివల్ల వినియోగదారులు చెల్లించిన నగదుకు తగిన స్వచ్ఛత ఆభరణాల్లో ఉందా అనే విషయం తేల్చుకోవచ్చు. గార్గ్ వివరించినట్టు, హాల్‌మార్క్ ఉన్న వెండి వస్తువుల సంఖ్య 2024లో 31 లక్షలకు ఉండగా, 2025లో 51 లక్షలకు చేరింది. కానీ, వెండిను కరిగించి చిన్నపాటి ఆభరణాలుగా మార్చి తక్కువ విలువలో అమ్మే సందర్భాల్లో హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ పత్రాల సరఫరా కొంత సవాలుగా మారుతోంది. వెండి ఆభరణాలకు 800, 835, 925, 958, 970, 990, 999 స్వచ్ఛతా ప్రమాణాల మేరకు హాల్‌మార్క్ ఇవ్వడం జరుగుతుంది. బీఐఎస్ హాల్‌మార్కింగ్ కోసం అవసరమైన వనరులను అంచనా వేసి, నిబంధనలు రూపొందించడానికి సిద్ధమవుతోంది కేంద్రం.




## బంగ్లాదేశ్‌కు ఐసీసీ షాక్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


భద్రతా కారణాల సాకుతో భారత్‌కు వచ్చేందుకు నిరాకరిస్తున్న బంగ్లాదేశ్‌కు ఐసీసీ గట్టి షాక్ ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారం భారత్‌లో మ్యాచ్‌లు ఆడకపోతే పాయింట్లు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేసింది. 2026 టీ20 ప్రపంచ కప్ వేదికలపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు, ఐసీసీ మధ్య ఉద్రిక్తత నెలకొంది. మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలన్న బీసీబీ డిమాండ్‌ను ఐసీసీ తిరస్కరించింది. ఆతిథ్య దేశంలో ఆడేందుకు నిరాకరిస్తే ప్రత్యర్థికి వాకోవర్ పాయింట్లు దక్కుతాయని స్పష్టం చేసింది. బంగ్లా ఆటగాడు ముస్తాఫిజుర్ రహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి రిలీజ్ చేసిన వివాదం కాస్తా ఇప్పుడు ప్రపంచ కప్ వేదికల మార్పు వరకు వెళ్ళింది. తమ జట్టును భారత్‌కు పంపే ప్రసక్తే లేదని, మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బీసీబీ డిమాండ్ చేస్తోంది. అయితే, ఐసీసీ చైర్మన్ జై షా నేతృత్వంలోని కమిటీ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ప్రస్తుత పరిస్థితి 1996 వన్డే ప్రపంచ కప్ నాటి సంఘటనలను గుర్తు చేస్తోంది. అప్పట్లో శ్రీలంకలో తమిళ టైగర్స్ దాడుల వల్ల భద్రతా భయాలతో ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు కొలంబోలో ఆడేందుకు నిరాకరించాయి.




## హెల్మెట్ కంపెనీతో జెమీమా రోడ్రిగ్స్ డీల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టీమిండియా స్టార్ క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్ మహిళల భద్రత, సాధికారత కోసం కీలక అడుగు వేశారు. మహిళలకు ప్రత్యేకంగా రూపొందించిన హెల్మెట్ ల కోసం ట్వారా కంపెనీతో ఆమె దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ భాగస్వామ్యంలో జెమీమా కంపెనీలో ఈక్విటీ భాగస్వామిగా కూడా ఉంటారు. జెమీమా మాట్లాడుతూ, "క్రీడలు మనకు క్రమశిక్షణ, నిలకడ, నమ్మకాన్ని నేర్పిస్తాయి. మహిళలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, భద్రత ఉంటే వారి ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరుగుతుంది. ట్వారా ఈ రెండు అంశాలపై దృష్టి సారించింది, అందుకే ఈ భాగస్వామ్యం నాకు సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. కంపెనీ వ్యవస్థాపకురాలు అల్పనా పరీదా మాట్లాడుతూ.. జెమీమా చేరడం గర్వకారణమని, ఆమె క్రమశిక్షణ, ఉత్సాహం, లక్ష్యం స్పష్టత కంపెనీ ఆలోచనలకు అనుగుణంగా ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం ట్వారా హెల్మెట్స్ 600కు పైగా నగరాల్లో ఆన్ లైన్ లో అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది చివరికి ఆఫ్ లైన్ రిటైల్ మార్కెట్ లోకి ప్రవేశించి నగరాల స్టోర్లలో ఉత్పత్తులను అందించనున్నట్లు కంపెనీ ప్లాన్ చేసుకుంది.



## కారు లోన్‌పై బ్యాంకుల ఆకర్షణీయ వడ్డీరేట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

కొత్త కారు కొనాలనుకునే వారికి కొత్త ఏడాది శుభవార్త తీసుకొచ్చింది. ప్రభుత్వరంగ బ్యాంకులు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో ఆఫర్స్ ప్రకటిస్తున్నాయి. 8 శాతం కంటే తక్కువ వడ్డీ రేట్లతో కార్ లోన్లు అందిస్తున్నాయి. దీనితో కేవలం రూ.10 వేల ఈఎంఐ కంటే తక్కువకే కారును సొంతం చేసుకోవచ్చు. వడ్డీ రేట్లలో స్వల్ప తేడా కూడా నెలవారీ వాయిదాలపై గణనీయమైన ప్రభావం చూపుతుండటంతో, సరైన బ్యాంక్ ఎంపిక కీలకంగా మారింది. వివిధ బ్యాంకుల్లో వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి.

- ❖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యల్పంగా 7.40 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది.
- ❖ పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లు కూడా దాదాపు 7.50 శాతం వడ్డీ రేట్లతో లోన్లు అందిస్తున్నాయి.
- ❖ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 7.60 శాతం నుంచి 9.20 శాతం వరకు వడ్డీ రేట్లతో పోటీలో ఉంది. అదనంగా, ఈ బ్యాంక్ 2026 మార్చి 31 వరకు ప్రాసెసింగ్ ఫీజును పూర్తిగా రద్దు చేయడం ద్వారా లోన్ ప్రారంభ ఖర్చులను తగ్గించింది. అలాగే బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కూడా తక్కువ వడ్డీ రేట్లతో కార్ లోన్లను అందిస్తోంది.

తక్కువ వడ్డీ రేట్లు, ఫీజు రాయితీల నేపథ్యంలో ఇది కొత్త కారు కొనుగోలుకు అనుకూల సమయమని నిపుణులు సూచిస్తున్నారు. లోన్ తీసుకునే ముందు వివిధ బ్యాంకుల ఆఫర్లను పోల్చి చూసి నిర్ణయం తీసుకుంటే, దీర్ఘకాలంలో ఖర్చులను తగ్గించుకోవచ్చు.

మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
08.01.2026
www.manasarkar.com

# దటీజ్.. శ్రీలీల!



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

తక్కువకాలంలో స్టార్‌డమ్ సంపాదించుకున్న హీరోయిన్లలో శ్రీలీల ఒకరు. క్యూట్ ఫేస్‌తో, అమాయకపు చిరునవ్వుతో అందరినీ బుట్టలో వేసుకున్న ఈ బ్యూటీ టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అని తేడా లేకుండా అంతటా సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఆమె హీరోయిన్‌గా నటించిన 'పరాశక్తి' మూవీ సంక్రాంతి పండక్కి (జనవరి 10న) విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఓ ఆసక్తికర విషయాన్ని చెప్పుకొచ్చింది. తను ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్న విషయం గురించి తొలిసారి స్పందించింది. శ్రీలీల మాట్లాడుతూ.. పిల్లల ప్రస్తావన వస్తే నాకు మాటలు రావు. వాళ్లు నాతో ఉంటే బాగుండేదనిపిస్తుంది. నాతో కలిసుండకపోయినా నేను వారిని బాగా చూసుకుంటున్నాను. కిస్ (2019) అనే కన్నడ మూవీ సమయంలో దర్శకుడు నన్ను ఓ ఆశ్రమానికి తీసుకెళ్లాడు. అక్కడే ఈ పిల్లలు ఉండేవారు. మేము ఫోన్‌లో మాట్లాడేవాళ్లం. వీలు దొరికినప్పుడల్లా అక్కడికి వెళ్లేదాన్ని. కానీ, ఈ విషయాన్ని నేను చాలాకాలం రహస్యంగా ఉంచాను. అయితే ఆ ఆశ్రమం వాళ్లు దీన్ని గోప్యంగా ఉంచడం దేనికి? మీరు బయటకు చెప్తేనే మిమ్మల్ని చూసి ఇంకో నలుగురైనా ముందుకొస్తారు అన్నారు. నిజమే కదా అనిపించింది. నేనేదో గొప్ప చేశానని చెప్పడం లేదు కానీ జనాలు కూడా ఆ దిశగా ఆలోచిస్తే బాగుంటుందని చెబుతోంది. దటీజ్.. శ్రీలీల!



# సంక్రాంతి సినిమాలన్నీ హిట్ కావాలి

## 'మన శంకరవరప్రసాద్ గారు' ప్రీ-రిలీజ్ వేడుకలో చిరంజీవి

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

నిర్మాతలు సుభిక్షంగా ఉన్నప్పుడే అసలైన సంక్రాంతి. ఈ సంక్రాంతికి బాక్సాఫీస్ వద్దకు వస్తున్న సినిమాలన్నీ హిట్ కావాలి అని మెగాస్టార్ మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. ఆయన కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి 'మన శంకరవరప్రసాద్ గారు'ది మాత్రమే కాదు. తెలుగు సినీ పరిశ్రమ మొత్తానిది కావాలి. ప్రభాస్, రవితేజ, శర్వా, నవీన్ పొలిశెట్టి అన్ని సినిమాలు హిట్ కావాలి. ఆ విజయాలను మీరు ఇచ్చి తీరతారని కోరుతున్నా. 2026 సంక్రాంతికి అన్నీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు వస్తున్నాయి. అనిల్ రావిపూడితో సినిమా చేస్తే వేరే లెవల్‌లో ఉంటుందని దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు అన్నారు. ఆయన చేతుల మీదుగానే ఈ సినిమా మొదలైంది. అనిల్ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. కామెడీతో పాటు, హృదయానికి హత్తుకునే సన్నివేశాలు ఉన్నాయి. వైవిధ్యంగా ఈ సినిమాను చేద్దామని నేను చెప్పాను. కానీ, అందుకు అనిల్ ఒప్పుకోలేదు. నా గత సినిమాల్లోని పాత్రలన్నీ ఒక క్యాప్సుల్‌లా చేసి, తన ఫోన్‌లో పెట్టుకున్నారు. ఈ సినిమాలో సన్నివేశానికి తగినట్లు వాటిని చేయమని చెప్పారు. వాటిని ఎంజాయ్ చేస్తూ చేశాను. షూటింగ్ చివరి రోజు చాలా ఎమోషనల్ అయ్యాను. అంతకుముందు ఎప్పుడూ అలా కాలేదు. షూటింగ్ ఒక పిక్నిక్‌లా జరిగేది. ఈ మధ్య కాలంలో ఇంత సరదాగా షూటింగ్ జరగలేదు. బడ్జెట్ పరంగా ఇది సూపర్‌హిట్ అయింది.

# 'నారి నారి నడుమ మురారి' నుంచి లవ్లీ నెంబర్ 'భల్లే భల్లే'

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

చార్మింగ్ స్టార్ శర్వా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నటిస్తున్న హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి' జనవరి 14న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయు, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్ర బృందం మ్యూజికల్ ప్రమోషన్స్ ని ప్రారంభించింది. విశాల్ చంద్రశేఖర్ స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ 'భల్లే భల్లే' విడుదలైంది. ఇది యంగ్ లవ్ లోని హ్యాపీనెస్ ని ప్రజెంట్ చేస్తోంది.





# కానిస్టేబుల్ కనకం2 హిట్ అవుతుంది

## హీరోయిన్ వర్ష బొల్లమ్మ

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో నటించిన బ్లాక్ బస్టర్ సిరీస్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. ఈ సిరీస్ కి కొనసాగింపుగా 'కానిస్టేబుల్ కనకం 2' ఈ నెల 8న ఈటీవీ విన్‌లో రాబోతుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ.. కానిస్టేబుల్ కనకం నాకు చాలా ప్రత్యేకం. ఇంత అద్భుతమైన ఎమోషన్ ఉన్న స్టోరీకి నన్ను ఎంపిక చేసినందుకు డైరెక్టర్ ప్రశాంత్ కి థాంక్యూ. సీజన్ 3 కూడా చేయాలని కోరుకుంటున్నాను. సాయిబాబా గారు, హేమంత్ గారు లాంటి ప్రొడ్యూసర్స్ ఇండస్ట్రీలో ఉంటే చాలా అద్భుతంగా ఉంటుంది. వాళ్లు మరింత అద్భుతమైన కంటెంట్ చేయాలని కోరుకుంటున్నాను. ఈటీవీలో భాగం కావడం చాలా గర్వంగా ఉంది. ఒకప్పుడు ఈటీవీ విన్ సబ్స్క్రైబ్ చేయమని అడిగే వాళ్ళం. కానీ ఈరోజు అందరి ఇంట్లో ఈటీవీ విన్ ఉంది. అది ఇది గొప్ప సక్సెస్ గా భావిస్తున్నాను. మేఘలేఖ పర్ఫామెన్స్ ఈ సీజన్లో అదిరిపోతుంది. సురేష్‌గారి మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది. సీజన్ 2 అద్భుతంగా ఉంటుంది. జనవరి 8 నుంచి స్ట్రీమ్ అవుతుంది. డెఫినెట్ గా చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు.

# ఓటీటీలోకి శివకార్తికేయన్ సైన్స్ ఫిక్షన్ 'అయలాన్'



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ నటించిన సైన్స్ ఫిక్షన్ మూవీ 'అయలాన్' ఆహా ఓటీటీలో నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్ గా నటించింది. కేజేఆర్ స్టూడియోస్.. ఫాంటమ్ ఎఫ్ఎక్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించగా.. ఆర్ రవికుమార్ దర్శకత్వం వహించారు. భారీ విజువల్ ఎఫెక్టులతో సైన్స్ ఫిక్షన్ కథతో తెరకెక్కించిన 'అయలాన్' 2024 సంక్రాంతికి తమిళనాట రిలీజై మంచి విజయం సాధించింది. తెలుగులో రిలీజ్ కు ప్లాన్ చేసినా అనివార్య కారణాలతో సాధ్యం కాలేదు. తమిళ వెర్షన్ సన్ నెక్స్ట్ లో స్ట్రీమింగ్ అవుతుండగా, ఇప్పుడు ఆహాలో తెలుగు వెర్షన్ ప్రేక్షకులకు అందుబాటులోకి వచ్చింది. మ్యూజిక్ లెజెండ్ ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో క్రేజీ కంటెంట్ ను తెలుగు ఆడియెన్స్ అందిస్తున్న ఆహా ఓటీటీ 'అయలాన్' చిత్రాన్ని తాజాగా స్ట్రీమింగ్ కు తీసుకొచ్చింది.

# పాంచాలి పంచ భర్తృక టైటిల్, ఫస్ట్‌లుక్



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

రాయల్ త్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయి రామ్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'పాంచాలి పంచ భర్తృక'. ఈ చిత్రంలో వెంకట్ దుగ్గిరెడ్డి, రాజ్ పవన్, జెమినీ సురేష్, ర్యాప్ సింగర్ రోల్ రిడా హీరోలుగా నటిస్తున్నారు. నట కిరీటి రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'పాంచాలి పంచ భర్తృక' చిత్రాన్ని వెంకట్ దుగ్గిరెడ్డి (యూఎస్ఏ) నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ శెట్టివారి, సాయినాథ్ మన్యం సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. లెస్ లాజిక్, మోర్ మ్యాజిక్ అనే క్యాప్షన్ తో ట్రెండీ కామెడీ మూవీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు డైరెక్టర్ గంగ సప్తశిఖర. నటకిరీటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా 'పాంచాలి పంచ భర్తృక' సినిమా టైటిల్ తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ .. ఒక కొత్త కథతో, కొత్త దర్శకుడు చేస్తున్న కుర్రకారు సినిమా ఇది. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఏంటి అనేది తెరపైనే చూడాలి. సరదాగా సాగే చిత్రమిది. చాలా కాలం తర్వాత ఇలాంటి మంచి కామెడీ చిత్రంలో నటించాను. ఈ సినిమాను ఆదరించి, కొత్త వాళ్లను సపోర్ట్ చేయండి. అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ.. పాంచాలి పంచభర్తృక ఈ పదం మనం విన్నదే అయినా టైటిల్ గా పెట్టేందుకు ఎవరూ ధైర్యం చేయలేదు. ఈ టైటిల్ లోనే ఒక ఫన్ ఉంది. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి ఎంటర్ టైన్ మెంట్ అందించి హిట్ కావాలని కోరుకుంటున్నా. జెమినీ సురేష్, రోల్ రిడా ఇద్దరూ నాకు మంచి ఫ్రెండ్స్. వీళ్లతో పాటు టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ చెబుతున్నా.

# వాలెంటైన్స్‌డేకు 'కపుల్ ఫ్రెండ్లీ' విడుదల

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా "కపుల్ ఫ్రెండ్లీ". ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ మూవీ గా 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా తెరకెక్కుతోంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేశారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. హీరో హీరోయిన్స్ సంతోష్ శోభన్, మానస వారణాసి తమ సినిమా డేట్ అనౌన్స్ చేస్తూ రిలీజ్ చేసిన వీడియో ఆకట్టుకుంటోంది. తెలుగు, తమిళంలో 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



# సమంత ప్రధాన పాత్రలో మా ఇంటి బంగారం

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తోన్న లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ను ఈనెల 9న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ టీజర్ ట్రైలర్ ప్రేక్షకులకు పవర్ఫుల్, ఇంటెన్స్ ఎక్స్ పీరియెన్స్ ను అందించనుందని వారు పేర్కొన్నారు. సమంతతో ఇది వరకు 'ఓ బేబీ' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని తెరకెక్కించిన డైరెక్టర్ నందినీ రెడ్డి ..మరోసారి ఈ స్టార్ హీరోయిన్‌ను 'మా ఇంటి బంగారం'లో డైరెక్ట్ చేస్తోంది. ఈ హిట్ కాంబోపై భారీ అంచనాలున్నాయి. అయితే ఈసారి మాత్రం డిఫరెంట్ ఎమోషన్స్, స్టోరీతో, బోల్డ్ గా, గ్రిప్పింగ్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా మా ఇంటి బంగారం సినిమా ఉండబోతోందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రంలో సమంత ప్రధాన పాత్రను పోషిచటంతో పాటు ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గమనిస్తే సమంత లుక్ చాలా పవర్‌ఫుల్‌గా, ఎఫెక్టివ్‌గా కనిపించి సోషల్ మీడియాలో మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. ఆమె పాత్రలోని ఇంటెన్సిటీ, పాత్రను తీర్చిదిద్దిన తీరు స్పష్టంగా తెలుస్తోంది. రా, హై ఇంపాక్ట్ యాక్షన్‌తో మన భారతీయ శైలిని మిక్స్ చేసినట్లు సమంత పాత్ర అలరించనుంది. దీంతో ఆమె స్థాయి మరో రేంజ్‌కు చేరుకోనుంది. మరి జనవరి 9న రాబోతోన్న టీజర్ ట్రైలర్ ఎలా ఉండనుందనే ఆసక్తి అందరిలోనూ పెరిగింది. సమంత లీడ్ రోల్ చేస్తోన్న 'మా ఇంటి బంగారం' చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రల్లో నటిస్తుండగా, సీనియర్ నటి గౌతమి, మంజుషా ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఓం ప్రకాశ్ సినిమాటోగ్రఫీ, సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు. కథనం, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ ను వసంత్ మారిన్‌గంటి, రాజ్ నిడిమోరు రచించగా, ప్రముఖ రచయిత సీతా ఆర్ మీనన్ క్రియేటివ్ సూపర్‌విజన్ చేస్తున్నారు.





# సరికొత్త లేయర్స్ ఉన్న చిత్రం సఃకుటుంబానాం

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

హెచ్.ఎన్.జి సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్ పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'సఃకుటుంబానాం'. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్ గా శశాంక్ మలి చేశారు. నూతన సంవత్సర దినోత్సవ సందర్భంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. ఈ చిత్రాన్ని చూసిన హీరో దీక్షిత్ శెట్టి స్పందిస్తూ... "ఒక సరికొత్త కాన్సెప్ట్ తో వచ్చిన చిత్రం సఃకుటుంబానాం. సినిమాలోని క్యారెక్టర్స్ ఇంకా అలాగే సినిమాలో కొన్ని ఒక ఫ్యామిలీ ఎంటర్టైనర్ లో సరికొత్తగా లేయర్స్ చూపించడం అనేది చాలా కొత్తగా అనిపించింది. ఈ సినిమాలో హీరో రామ్ కిరణ్ నటన చూసి కొత్త వాడిలా అనిపించలేదు. తనలోని స్ఫూర్తిని ఎంత పెట్టి ఈ సినిమాలో నటించారు. ఒక కొత్త నటుడుకి మంచి కథ అలాగే టీం దొరకడం చాలా కష్టం కానీ ఇతనికి అలా దొరకడం చాలా అదృష్టం. భవిష్యత్తులో మరింత మంచి సినిమాలు తనకు రావాలని కోరుకుంటున్నాను. అలాగే సినిమాలోని పాటలు, రామ్ కిరణ్ డాన్స్ అద్భుతంగా అనిపించాయి. సినిమా కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం చాలా బాగా అనిపించాయి. నిర్మాణం విలువలు బాగున్నాయి. తొలి చిత్రంలోని ఎందరో సీనియర్ నటులతో నటించడం రామ్ కిరణ్ కు మరొక వరం అనుకోవచ్చు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

# 'మన శంకర వర ప్రసాద్ గారు'లో వింటేజ్ మెగాస్టార్‌ని చూస్తారు

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ 'మన శంకర వర ప్రసాద్ గారు'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఉత్సాహాన్ని మరింత పెంచుతూ విక్టరీ వెంకటేష్ కీలక పాత్రతో నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తుండగా, శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సినిమా ప్రమోషన్‌లు అద్భుతంగా జరుగుతున్నాయి. ట్రైలర్, పాటలు సినిమా పై అంచనాలను భారీగా పెంచాయి. 'మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల మీడియాతో మాట్లాడుతూ సినిమా విశేషాలు పంచుకున్నారు.



- ఫన్ కామెడీ.. ఫ్యామిలీ ఎమోషన్
- నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల

**సెన్సార్ జరిగింది కదా.. రిపోర్ట్ ఎలా వుంది?**

చాలా మంచి రిపోర్ట్ వచ్చింది. సినిమాని చాలా ఎంజాయ్ చేశారు. క్లిన్ ఫిల్మ్. ఫుల్ ఫ్యామిలీ ఫన్. పిల్లలు, ఫ్యామిలీతో కలిసి అందరూ చూసే సినిమా ఇది.

**ఇద్దరు పెద్ద స్టార్స్ కలిసి చేసిన సినిమా కదా.. ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత అభిమానులు నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?**

ఇద్దరి ఫ్యాన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. సోషల్ మీడియా నుంచి కూడా అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. చిరంజీవి గారు, వెంకటేష్‌గారు ఇద్దరూ చాలా హ్యాపీగా కలిసి పని చేశారు.

**సుస్మిత గారు. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్ కదా.. ఈ ప్రాసెస్ ని ఎలా ఎంజాయ్ చేశారు?**

ఇది మైల్ స్టోన్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాము. నాన్నగారి కోర్ జానర్ లో చేయడం, అనిల్ గారు ఆ జానర్ ని తీసుకోవడం సూపర్బ్. సాహు గారితో జర్నీ బ్యూటీఫుల్. ఇది చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన మైల్ స్టోన్ ప్రాజెక్ట్. ఈ కాంబినేషన్ మళ్ళీ కంటిన్యూ కావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాతో నాన్న గారు ఒక కొత్త ట్యాలెంట్ బాక్స్ ని ఓపెన్ చేసినట్లుగా అనిపించింది. రౌడీ అల్లుడు సినిమాలో చూసినట్లుగా వుందని ఫ్యాన్స్ అంటున్నారు. వింటేజ్ ఛార్మ్ ని గుర్తు చేస్తూనే ఇందులో ఆయన నటన చాలా ఫ్రెష్ గా వుంటుంది. నాన్న గారు బరువు తగ్గడంతో పాటు ఫిట్ నెస్ పై ప్రత్యేక దృష్టి పెట్టారు. చాలా కొత్త ఛార్మ్ తో కనిపించారు. దీంతో ఆయనకి కాస్ట్యూమ్స్ డిజైన్ చేయడం కూడా మాకు ఈజీ అయ్యింది.

**సాహు గారు.. సంక్రాంతికి చాలా సినిమాలు వున్నాయి.. థియేటర్స్ ఇబ్బంది ఉంటుందనే మాట వినిపిస్తుంది ?**

మాకు రన్నింగ్ డిస్ట్రిబ్యూటర్స్ ఉన్నారు. సంక్రాంతిలో ముందు నుంచి మా సినిమా వుంది. అయితే ఇన్ని సినిమాలు వస్తున్నప్పుడు ఒకటో అర థియేటర్స్ తగ్గడం సహజమే. కాకపోతే మా సినిమా వరకూ థియేటర్స్ సమస్య పెద్దగా లేదు.

**సుస్మిత గారు .. వెంకటేష్ గారి పాత్ర ఎలా ఉండబోతోంది?**

వెంకటేష్ గారు బిగ్ ఇంపాక్ట్ ఫుల్ క్యారెక్టర్ లో కనిపిస్తారు. ఆయన వచ్చిన తర్వాత ఫన్ మరింతగా రైజ్ అవుతుంది. చాలా ముఖ్యమైన పాత్ర. చాలా ఎంటర్‌టైన్‌మెంట్ వున్న రిచ్ క్యారెక్టర్.

**సాహు గారు.. చిరంజీవి గారి పాత్ర ఎలా వుంటుంది ?**

ట్రైలర్ చిరంజీవి గారి క్యారెక్టర్ కి సంబంధించి షేడ్స్ చూపించాం. ఆయన క్యారెక్టర్ లో ఫన్ యాక్షన్ ఎమోషన్ అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ వుంటాయి. వెంకటేష్‌గారు చిరంజీవి గారి మధ్య చాలా అద్భుతమైన కామెడీ సీన్స్ వుంటాయి. ట్రైలర్ జస్ట్ సాంపిల్ మాత్రమే. ట్రైలర్ లో చిరంజీవి గారు క్యారెక్టర్ ని పరిచయం మాత్రమే చేశాం. సినిమాలో చాలా వుంది. ఈ సినిమా సంక్రాంతి విందు అనేది చిన్న మాట.. సినిమా చూశాను కాబట్టి చెబుతున్నాను.

**చిరంజీవి గారిని ప్రమోషన్స్ లో ఎప్పటినుంచి చూడబోతున్నాం?**

అన్ని ఏరియాల్లో ప్రమోషన్స్ అద్భుతంగా జరుగుతున్నాయి. అనిల్ గారు ఫుల్ స్పీడ్ లో ప్రమోషన్స్ చేస్తున్నారు. చిరంజీవి గారు పోస్ట్ ప్రొడక్షన్, డబ్బింగ్ లో బిజీగా వున్నారు. రేపటి నుంచి ఆయన వర్క్ అయిపోతుంది. ప్రీరిలీజ్ ఈవెంట్ వుంది. చిరంజీవి గారు వెంకటేష్ గారు ఇద్దరూ వస్తున్నారు. ఆ నెక్స్ట్ నుంచి ప్రమోషన్స్ లో ఫుల్ బిజీ అవుతారు. ఇందులో ఒక స్పెషల్ సాంగ్ వుంది. అందులో వింటేజ్ చిరంజీవి గారిని చూస్తారు.

**-ఎం.డి అబ్దుల్**

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**